

RNI NO.TGTEL/25/A5224

జోర్దార్

JORDAR TELUGU DAILY ది తెలుగు దినపత్రిక


అవినీతి అంతం – మా పంతం



కరీంనగర్ సంపుటి : 01 సంచిక : 284 ఆదివారం, నవంబర్ 01 2026 , పేజీలు - 8 వెల : 2/- epaper.jordar.com

నాలుగు సార్లు రుజువైన నేరం... నెలలుగా నిద్రపోతున్న చర్యలు

- జిల్లా పాలనాధికారి కార్యాలయంలో మూలుగుతున్న విచారణ ఫైలు
- నకిలీ సంతకాల వ్యవహారం - ఫైలుకు అడ్డుకట్ట ఎవరిది?
- జిల్లా పాలనాధికారి గారూ జవాబు చెప్పాలి



పెద్దపల్లి,జోర్దార్ ప్రతినిధి

1. నేపథ్యం

పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం వడకాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న పాఠశాల సహాయకురాలు వీణావాణి విధుల్లో నిర్లక్ష్యం, అక్రమాలకు పాల్పడుతున్నారని పౌరుడు అమరగాని ప్రదీప్ కుమార్ ఫిర్యాదు చేశారు. దీనిపై జిల్లా విద్యాధికారి విచారణకు ఆదేశించారు.

2. నాలుగు విచారణలు – ఒకే తీర్పు

మొదట మూడు సార్లు ముగ్గురు అధికారులు విచారణ జరిపారు. ఆ నివేదికలపై అనుమానం రావడంతో ఫిర్యాదుదారుడు ఆధారాలతో సహా ప్రాంతీయ విద్యా సంయుక్త సంచాలకులు, వరంగల్ వారిని కలిశారు. వారి ఆదేశాలతో నాలుగోసారి జూలపల్లి మండల విద్యాధికారి సరస్వతి పకడ్బందీగా విచారణ చేశారు. ఈ విచారణలో స్పష్టంగా తేలింది ఏమిటంటే, వీణావాణి ఇతరుల సంతకాలను నకిలీగా సృష్టించి, తప్పుడు పత్రాలు సమర్పించి ప్రభుత్వాన్ని మోసం చేసింది.

3. ఫైలు ఎక్కడ ఆగింది?

నేరం రుజువైన నివేదికలు జిల్లా విద్యాధికారికి అందాయి. కానీ ఆయన జిల్లా పాలనాధికారి అనుమతి కోసం పంపామని చెప్పి చేతులు దులుపుకున్నారు. అక్కడి నుంచి ఫైలు కదలడం లేదు. నెలలు గడుస్తున్నా జిల్లా పాలనాధికారి కార్యాలయంలోనే మూలుగుతోంది. అక్రమం రుజువైనా శిక్ష ఎందుకు లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

4. ప్రజలు అడుగుతున్న ప్రశ్నలు

– నివేదికల్లో నేరం స్పష్టంగా ఉన్నా చర్యలు ఎందుకు లేవు?

– ఫైలును తొక్కిపెట్టడంలో ఆంతర్యం ఏమిటి?– అక్రమాలకు పాల్పడిన ఉపాధ్యాయురాలిని కాపాడుతున్నది ఎవరు?


– అధికారులు నెలల తరబడి విచారణలు చేసి ఇచ్చిన నివేదికలకు విలువ లేదా?

5. ఫిర్యాదుదారుని డిమాండ్

“రెండు సంవత్సరాలుగా పోరాడి నాలుగు సార్లు విచారణలు జరిపించాను. నేరం రుజువైంది. అయినా చర్యలు లేవు. జిల్లా పాలనాధికారి గారు తన మౌనానికి కారణం చెప్పాలి” అని ఫిర్యాదుదారుడు ప్రదీప్ కుమార్ డిమాండ్ చేస్తున్నారు.

తెలంగాణ వ్యవసాయ శాఖలోసగం జిల్లాల్లో ఏడీఏలే డీఏఓలుగా అదనపు బాధ్యతలు

- వ్యవసాయ శాఖలోనే ఖాళీ పోస్టులు..
- రైతులకు తప్పని ఇబ్బందులు.



(హైదరాబాద్ జోర్దార్ అగ్రికల్చర్ ప్రతినిధి)

వ్యవసాయ శాఖలో అధికారుల కొరత పాలనపై తీవ్ర ప్రభావం చూపుతోంది. జిల్లా స్థాయిలో కీలకమైన పోస్టులు పూర్తిస్థాయి అధికారుల్లేక ఇన్‌ఛార్జిల చేతుల్లో కొనసాగుతున్నాయి. మరోవైపు రాష్ట్రంలోని సగం జిల్లాల్లో అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ (ఏడీఏ) స్థాయి అధికారులు జిల్లా వ్యవసాయ అధికారులుగా (డీఏఓ) అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది.ఒకవైపు జిల్లా స్థాయి బాధ్యతలు, మరోవైపు తమ సొంత హోదాకు సంబంధించిన విధులు నిర్వహించాల్సి రావడంతో అధికారులపై పని ఒత్తిడి పెరుగుతోంది. దీంతో వారి ప్రధాన శాఖల్లోనూ ఖాళీలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కీలక పోస్టులు ఖాళీగా ఉండటం, ఉన్నతాధికారులకు అదనపు బాధ్యతలు అప్పగించడంతో వ్యవసాయ శాఖలో పరిపాలనా సమన్వయం, క్షేత్రస్థాయి పర్యవేక్షణపై ప్రభావం పడే పరిస్థితి నెలకొంది.రైతులకు ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, విత్తనాలు, ఎరువుల సరఫరా, పంటల పర్యవేక్షణ వంటి సేవలు సకాలంలో అందాలంటే ప్రతి స్థాయిలో పూర్తిస్థాయి అధికారులు ఉండాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో ఖాళీ పోస్టులను భర్తీ చేసి వ్యవసాయ శాఖలో పూర్తిస్థాయి అధికారులను నియమించాలనే డిమాండ్ వినిపిస్తోంది.

దివ్యాంగుల నిధులు.. అధికారుల జల్సాలు!

- దివ్యాంగ చిన్నారుల విద్యా, పరిచయ యాత్ర కోసం కేటాయించిన రూ.2 లక్షల నిధుల వినియోగంపై ఆరోపణలు
- ఖమ్మం నుంచి హైదరాబాద్ రామోజీ ఫిల్మ్‌సిటీకి వెళ్లిన యాత్రలో అధికారులు, సిబ్బందితో పాటు కుటుంబ సభ్యులు కూడా వెళ్లినట్లు ఆరోపణలు
- నిబంధనల ప్రకారం పిల్లలు, ప్రత్యేక ఉపాధ్యాయులు మాత్రమే వెళ్లాల్సి ఉండగా కుటుంబ సభ్యుల చేరికపై ప్రశ్నలు
- గతంలో ప్రభుత్వ రవాణా సంస్థ బస్సులు వినియోగించగా.. ఈసారి ప్రైవేటు పాఠశాలల బస్సుల వినియోగంపై అనుమానాలు
- యాత్రకు వెళ్లిన సిబ్బందికి అనుమతులు ఎవరు ఇచ్చారన్న దానిపై సందేహాలు
- పిల్లల భోజనం, రవాణా కోసం కేటాయించిన నిధుల్లో అధికారుల కుటుంబాల ఖర్చులు కలిశాయా?
- బస్సుల అద్దె, భోజనం, ఇతర ఖర్చులకు సంబంధించిన బిల్లులపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్
- దివ్యాంగుల నిధుల వినియోగంపై పూర్తిస్థాయి విచారణ జరిపి వాస్తవాలు బయటపెట్టాలని విద్యావర్గాల డిమాండ్



(హైదరాబాద్ జోర్దార్ ప్రతినిధి)

1. అసలు జరిగింది ఏమిటి? – తెర వెనుక భాగోతం

దివ్యాంగ చిన్నారులకు ఆత్మవిశ్వాసం కల్పించేందుకు, లోకాన్ని చూపించేందుకు ప్రభుత్వం ప్రతి జిల్లాకు ప్రధానమంత్రి ఆదర్శ పాఠశాలల నిధుల కింద రెండు లక్షల రూపాయలు కేటాయించింది. దీని ఉద్దేశం స్పష్టం – పిల్లలు చారిత్రక, విద్యా ప్రదేశాలు చూడాలి.కానీ ఖమ్మం జిల్లాలో జరిగింది వేరు. ఈ నెల 18న హైదరాబాద్ రామోజీ చిత్రనగరానికి తీసుకెళ్లిన యాత్రలో అసలు లబ్ధిదారులైన దివ్యాంగ పిల్లల కంటే అధికారులే ఎక్కువగా ఉన్నారు. జిల్లా విద్యాధికారి కార్యాలయానికి చెందిన ఏడుగురు పరిపాలనా సిబ్బంది, లెక్కల విభాగం, పర్యవేక్షణ సిబ్బంది, భవిత కేంద్రాల సిబ్బందితో పాటు వారి భార్యలు, పిల్లలు కూడా రెండు బస్సుల్లో విహారానికి వెళ్లారు. నిబంధన ప్రకారం వెళ్లాల్సింది పిల్లలు, వారి ప్రత్యేక ఉపాధ్యాయులు మాత్రమే. కుటుంబ సభ్యులకు అక్కడ ఏం పని?

2. నిబంధనల ఉల్లంఘనకు నిలువెత్తు నిదర్శనం

– అనుమతి లేని యాత్ర: సిబ్బంది ఈ నెల 15న యాత్రకు వెళ్తామని స్వయంగా దరఖాస్తు పెట్టుకున్నారు. కానీ 15, 16, 17 తేదీల్లో జిల్లా విద్యాధికారి సెలవులో ఉన్నారు. మరి అనుమతి ఇచ్చింది ఎవరు? కార్యాలయాన్ని ఖాళీ చేసి ఏడుగురు ఒకేసారి ఎలా వెళ్లారు?– ప్రైవేటు బస్సుల మతలబు: గతంలో ఇటువంటి యాత్రలకు ప్రభుత్వ రవాణా సంస్థ బస్సులు వాడేవారు. లెక్కలు స్పష్టంగా ఉండేవి. ఈసారి నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు పాఠశాలల బస్సులు వాడారు. ప్రైవేటు బస్సులకు ఎంత చెల్లించారు? ఆ సొమ్ము ఎవరి జేబులోకి వెళ్లింది? ఇది పెద్ద అనుమానంగా మారింది.– నిధుల మళ్లింపు: పిల్లల భోజనం, రవాణా కోసం ఇచ్చిన రెండు లక్షల్లో అధికారులు, వారి కుటుంబ సభ్యుల తిండి, తిప్పల ఖర్చు కూడా కలిసిపోయింది. ఇది స్పష్టంగా నిధుల దుర్వినియోగం కాదా?

3. అధికారుల నిర్లక్ష్యం – రాష్ట్ర వ్యాప్తంగా ఇదే తీరు

వాస్తవానికి ఈ పరిచయ యాత్రలకు పిల్లలు, ప్రత్యేక ఉపాధ్యాయులు మాత్రమే వెళ్లాలి. కానీ రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కార్యాలయాల సిబ్బంది తమ కుటుంబాలతో వెళ్తున్నారు. రాష్ట్ర స్థాయి అధికారులు పర్యవేక్షణ చేయకపోవడం వల్లనే ఈ దుర్వినియోగం ని విద్యావర్గాలు మండిపడుతున్నాయి.

4. తేలాల్సిన ప్రశ్నలు

1. ఆ రెండు బస్సుల్లో వెళ్లిన దివ్యాంగ పిల్లలు ఎంతమంది? అధికారులు, వారి కుటుంబ సభ్యులు ఎంతమంది?

2. సెలవులో ఉన్న అధికారి పేరుతో ఎవరు అనుమతి ఇచ్చారు?

3. ప్రైవేటు బస్సులకు చెల్లించిన మొత్తం ఎంత? బిల్లులు ఎక్కడ?ఇది పిల్లల కోసం పెట్టిన యాత్ర కాదు, పెద్దల కోసం పిల్లల పేరుతో చేసిన విహార యాత్ర. దీనిపై పూర్తి స్థాయి విచారణ జరిపి, నిధులు దుర్వినియోగం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ లోకం డిమాండ్ చేస్తోంది.

వివరణ: జిల్లా ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ కన్వీనర్ ప్రవీణ్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ నిబంధన ప్రకారం విహారయాత్రకు తీసుకువెళ్లామని ఇందులో డివోలు కార్యాలయ సిబ్బంది కానీ ఉద్యోగులు కానీ లేరని. పైన పేర్కొన్న ఆరోపణల్లో నిజాలు లేవని నిజాయితీగా పని చేస్తున్నామని ఖమ్మం జిల్లా కోఆర్డినేటర్ ప్రవీణ్ వివరణ ఇచ్చారు ఏది నిజం అనేది విద్యాశాఖ కమిషనర్ ప్రత్యేక కమిటీ వేసి విచారణ జరిపిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి ఇది ఇలా ఉండగా రాష్ట్రంలోని 33 జిల్లాల్లో కూడా ప్రభుత్వమిచ్చిన 2 లక్షల నిధులను ఇష్టారాజ్యంగా ఖర్చు చేశారని 66 లక్షలు సుమారు 40 లక్షలు పక్కదారి పట్టాయని సామాజికవేత్తలు విద్యాభిమానులు ఆరోపిస్తున్నారు. ఏది నిజం అనేది ప్రభుత్వం ఏసీబీ లేదా విజిలెన్స్ చే విచారణ జరిపిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి

నిమజ్జనాలతో హుస్సేన్‌సాగర్‌లో పెరిగిన నీటి కాలుష్యం - పీసీబీ పరిశీలనలో సంచలన విషయాలు



హైదరాబాద్: హైదరాబాద్ నగరంలోని గణేశ్ విగ్రహాల నిమజ్జనం సమయంలో హుస్సేన్‌సాగర్‌లోని 6 పర్యవేక్షణ కేంద్రాల్లో మురుగు(టర్బిడిటీ) విలువలు పెరిగినట్టు పొల్యూషన్? కంట్రోల్ బోర్డు చేసిన నీటి నాణ్యతా పరీక్షల్లో తేలింది. నిమజ్జనం తర్వాత అంతకుముందు స్థాయికి చేరుకోలేదని పీసీబీ పరిశీలనలో వెల్లడైంది. నెక్లెస్‌రోడ్ ప్రాంతంలో నిమజ్జన సమయంలో అత్యధికంగా 200 ఎన్‌టీయూ(నెఫెలోమెట్రిక్ టర్బిడిటీ యూనిట్) టర్బిడిటీ నమోదైంది. సెప్టెంబర్ 14వ తేదీ వినాయకచవితి రోజు, నిమజ్జనానికి ముందు 11వ తేదీ, 17, 19, 21, 23 తేదీల్లో నిమజ్జన సమయంలో, నిమజ్జనం అనంతరం 28వ తేదీన కాలుష్య నియంత్రణ మండలి నాణ్యతా పరీక్షలను చేపట్టింది.వరీక్షించిన ప్రదేశాలు

1.కంట్రోల్ పాయింట్ బుద్ధ విగ్రహం దగ్గర(హుస్సేన్‌సాగర్ మధ్యలో)

2. లుంబినీ పార్క్ దగ్గర

3.ఎన్టీఆర్ పార్క్ ఎదురుగా ప్లాట్‌ఫాం నంబరు–1 వద్ద

4. ఎన్టీఆర్ పార్క్ ఎదురుగా ప్లాట్‌ఫాం నంబరు– 2 వద్ద

5. నెక్లెస్ రోడ్ వద్ద

6. నిమజ్జన ప్రాంతం దగ్గర్లోని లేపాక్షి హ్యాండిక్రాఫ్ట్స్ వద్ద

పీసీబీ పరీక్షల్లో ఏం తేలిందంటే?


గణేశ్? నిమజ్జన సమయంలో అన్ని పర్యవేక్షణ కేంద్రాల్లో టోటల్ సస్పెండెడ్ సాలిడ్స్(టీఎస్ఎస్) విలువలు పెరిగాయని కాలుష్య నియంత్రణ పేర్కొంది. ఎన్టీఆర్ పార్కు ఎదురుగా ఉన్న ప్లాట్‌ఫాం నంబరు–1 వద్ద నిమజ్జన సమయంలో అత్యధికంగా లీటరుకు 99 మిల్లీగ్రాముల టీఎస్ఎస్ నమోదైందని తెలిపింది. నిమజ్జన సమయంలో అన్ని ప్రాంతాల్లోనూ కెమికల్ ఆక్సీజన్ డిమాండ్ (సీవోడీ) విలువలు గణనీయంగా పెరిగాయని పీసీబీ పరిశీలనలో వెల్లడైంది.నెక్లెస్‌రోడ్ వద్ద అత్యధికంగా లీటరుకు 164 మి.గ్రా కెమికల్ ఆక్సీజన్ డిమాండ్ నమోదైంది. నిమజ్జనం తర్వాత అన్ని ప్రాంతాల్లో సీవోడీ విలువలు నిమజ్జనానికి ముందున్న స్థాయికి తిరిగి చేరుకోలేదని వెల్లడైంది. ప్లాట్‌ఫాం నంబర్ 1, 2, నెక్లెస్ రోడ్, బుద్ధ విగ్రహం సమీపంలోని ప్రాంతాల్లో నిమజ్జన సమయంలో ఫీకల్ కోలిఫామ్ బ్యాక్టీరియా స్థాయిలు గణనీయంగా పెరిగినట్లు పీసీబీ గుర్తించింది. లుంబినీ పార్క్ వద్ద నిమజ్జనం తర్వాత మరింత పెరిగాయి. లేపాక్షి హస్తకళల కేంద్రం వద్ద నిమజ్జన సమయంలో నమోదైన స్థాయిలోనే కొనసాగిందని పీసీబీ నాణ్యత పరీక్షల్లో వెల్లడైంది.

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం

తనిఖీల సమయంలోనే ప్రత్యక్షమయ్యే అధ్యాపకులు!

■ వరంగల్ లో ఒక ప్రైవేట్ మెడికల్ కాలేజీలో అసలేం జరుగుతోంది? రికార్డుల్లో ఒకరు.. క్షేత్రస్థాయిలో మరొకరా?

■ సీసీ కెమెరా ఫుటేజ్ పరిశీలిస్తే అసలు నిజాలు వెలుగులోకి! మెడికల్ సోషల్ వర్కర్ ఎల్.ఎల్.బి. రెగ్యులర్ చదువుపైనా విచారణకు డిమాండ్



(హైదరాబాద్ జోర్దార్ ప్రతినిధి)

వైద్య విద్యను అందించాల్సిన విద్యాసంస్థలోనే సిబ్బంది విధుల నిర్వహణపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వరంగల్‌లో ఒక ప్రైవేట్ మెడికల్ కళాశాలలో అధ్యాపకుల నియామకాలు, హాజరు, బోధనా విధులు, ఇతర సిబ్బంది పనితీరుపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రికార్డుల్లో అధ్యాపకుల పేర్లు ఉన్నప్పటికీ వారు వాస్తవంగా ప్రతిరోజూ కళాశాలకు వచ్చి విధులు నిర్వహిస్తున్నారా? లేక తనిఖీల సమయంలో మాత్రమే ప్రత్యక్షమవుతున్నారా? అనే అంశంపై సమగ్ర విచారణ జరపాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

కళాశాలలోని కొన్ని విభాగాల్లో సుమారు పదిమంది వరకు సిబ్బంది ఉండాల్సిన పరిస్థితి ఉన్నప్పటికీ, వారంతా వాస్తవంగా విధులకు హాజరవుతున్నారా? విద్యార్థులకు బోధన అందిస్తున్నారా? అనే అంశాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తనిఖీలు నిర్వహించే సమయంలో మాత్రమే సంబంధిత అధ్యాపకులను బయట నుంచి పిలిపించి అధికారులకు చూపిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తనిఖీలు ముగిసిన అనంతరం వారు తిరిగి వెళ్లిపోతున్నారనే ఫిర్యాదులు కూడా ఉన్నాయి. ఈ ఆరోపణల్లో వాస్తవమెంత అనేది అధికారులు క్షేత్రస్థాయిలో తేల్చాల్సిన అవసరం ఉంది.

సీసీ కెమెరా ఫుటేజ్ పరిశీలిస్తే అసలు నిజాలు బయటపడవా?

ఈ వ్యవహారంలో కేవలం హాజరు రిజిస్టర్లు, బయోమెట్రిక్ వివరాలు పరిశీలిస్తే సరిపోదు. కళాశాల ప్రధాన ప్రవేశ ద్వారం, సంబంధిత విభాగాలు, కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఫుటేజ్‌ను కూడా అధికారులు పరిశీలించాలి. అధ్యాపకులు ఏ సమయానికి కళాశాలలోకి వస్తున్నారు? ఎప్పుడు బయటకు వెళ్తున్నారు? తనిఖీలకు ముందు, తనిఖీల రోజున, తనిఖీలు ముగిసిన తర్వాత వారి రాకపోకల్లో ఏమైనా తేడాలు ఉన్నాయా? అనే అంశాలను పరిశీలిస్తే వాస్తవ పరిస్థితి వెల్లడయ్యే అవకాశం ఉంది.అందువల్ల గతంలో నిర్వహించిన తనిఖీల తేదీలతో పాటు సంబంధిత కాలానికి అందుబాటులో ఉన్న సీసీ కెమెరా రికార్డులు, హాజరు రిజిస్టర్లు, బయోమెట్రిక్ వివరాలను పరస్పరం సరిపోల్చాలి. ఫుటేజ్‌ను ఎలాంటి మార్పులు లేకుండా భద్రపరిచి, స్వతంత్ర విచారణ బృందం ద్వారా పరిశీలించాలి. రికార్డులు ఇప్పటికే తొలగించబడి ఉంటే వాటి నిల్వ, తొలగింపు విధానంపై కూడా వివరణ తీసుకోవాలి.

మెడికల్ సోషల్ వర్కర్ విధుల నిర్వహణపై మరో కీలక ప్రశ్న!

ఇదే కళాశాలలో మెడికల్ సోషల్ వర్కర్‌గా పనిచేస్తున్న వ్యక్తి ఎల్.ఎల్.బి. రెగ్యులర్ కోర్సులో చదువుతున్నట్లు సమాచారం. ఒకవైపు రెగ్యులర్ విద్యార్థిగా న్యాయ విద్యను అభ్యసిస్తూ, మరోవైపు కళాశాలలో పూర్తిస్థాయి ఉద్యోగ విధులు ఎలా నిర్వహిస్తున్నారు? అనే అంశంపై కూడా స్పష్టత అవసరం.రెగ్యులర్ కోర్సు అంటే నిర్దేశిత తరగతులు, హాజరు, విద్యా కార్యకలాపాలు ఉంటాయి. అదే సమయంలో మెడికల్ సోషల్ వర్కర్‌గా కూడా విధులు నిర్వహించాల్సి ఉంటుంది. అలాంటప్పుడు రెండు బాధ్యతలను ఏకకాలంలో ఎలా నిర్వహిస్తున్నారు? ఎల్.ఎల్.బి. కళాశాల హాజరు వివరాలు, తరగతుల సమయాలు, మెడికల్ సోషల్ వర్కర్ ఉద్యోగ హాజరు, విధుల సమయాలు పరస్పరం సరిపోతున్నాయా? అనే అంశాలను అధికారులు పరిశీలించాలి.సంబంధిత వ్యక్తి విద్యాభ్యాసం, ఉద్యోగ నియామక నిబంధనలు, విధుల స్వభావం, హాజరు వివరాలు, సెలవుల వినియోగం, వేతనాల చెల్లింపులను పరిశీలించి వాస్తవాలను వెల్లడించాలి. ఒకవేళ రెండు బాధ్యతల నిర్వహణలో నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. అయితే రెగ్యులర్ కోర్సులో చదువుతున్నారనే ఒక్క కారణంతోనే ఉద్యోగ నిబంధనల ఉల్లంఘన జరిగిందని నిర్ణయించకుండా, సంబంధిత విశ్వవిద్యాలయం, ఉద్యోగ సంస్థ నిబంధనల ఆధారంగా విచారణ జరపాలి.

అధికారులు సమాధానం చెప్పాల్సిన ప్రశ్నలు ఇవే!

1. కళాశాల రికార్డుల్లో ఉన్న అధ్యాపకులందరూ ప్రతిరోజూ విధులకు హాజరవుతున్నారా?
2. తనిఖీల సమయంలో మాత్రమే అధ్యాపకులను పిలిపించి చూపిస్తున్నారనే ఆరోపణల్లో వాస్తవమెంత?
3. అధ్యాపకుల రాకపోకలను నిర్ధారించేందుకు సీసీ కెమెరా ఫుటేజ్‌ను పరిశీలించారా?
4. బయోమెట్రిక్ హాజరు, వేతనాల చెల్లింపులు, సీసీ కెమెరా రికార్డులు ఒకదానితో మరొకటి సరిపోతున్నాయా?
5. మెడికల్ సోషల్ వర్కర్‌గా పనిచేస్తున్న వ్యక్తి ఎల్.ఎల్.బి. రెగ్యులర్ కోర్సు చదువుతున్నట్లయితే ఉద్యోగ విధులు, విద్యాభ్యాసం రెండింటి హాజరు ఎలా నిర్వహిస్తున్నారు?
6. సంబంధిత వ్యక్తి నియామక నిబంధనలు, విధుల సమయాలు, విద్యాసంస్థ హాజరు వివరాలను అధికారులు పరిశీలించారా?
7. గతంలో నిర్వహించిన తనిఖీల్లో సమర్పించిన సిబ్బంది వివరాలు వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా ఉన్నాయా?

ఆకస్మిక తనిఖీలు చేపట్టి వాస్తవాలు బయటపెట్టాలి!

ఈ వ్యవహారంపై కళాశాల యాజమాన్యం ఇచ్చే వివరణతోనే విచారణను ముగించకుండా, సంబంధిత వైద్య విద్యా శాఖ, నేషనల్ మెడికల్ కమిషన్ అధికారులు స్వతంత్రంగా విచారణ చేపట్టాలి. అధ్యాపకుల నియామక పత్రాలు, విద్యార్హతలు, అనుభవ ధ్రువపత్రాలు, హాజరు రికార్డులు, వేతనాల వివరాలు, సీసీ కెమెరా ఫుటేజ్, బోధనా రికార్డులను పరిశీలించాలి. అవసరమైతే విద్యార్థులు, ఉద్యోగుల నుంచి స్వతంత్రంగా వివరాలు సేకరించాలి.వైద్య విద్య అనేది కేవలం రికార్డుల్లో సిబ్బంది పేర్లు చూపించడం లేదా తనిఖీల సమయంలో వారిని హాజరువరచడంతో పూర్తయ్యేది కాదు. అర్హత కలిగిన అధ్యాపకులు నిరంతరం అందుబాటులో ఉండి విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలి. ఈ అంశాల్లో నిర్లక్ష్యం లేదా నిబంధనల ఉల్లంఘన జరిగితే దాని ప్రభావం విద్యార్థుల భవిష్యత్తుపై పడుతుంది.తనిఖీల సమయంలో మాత్రమే కనిపించే అధ్యాపకుల ఆరోపణలపై సమాధానం ఎవరు చెబుతారు? మెడికల్ సోషల్ వర్కర్ ఉద్యోగ విధులు, రెగ్యులర్ ఎల్.ఎల్.బి. విద్యాభ్యాసం రెండింటి నిర్వహణపై వాస్తవాలు ఎప్పుడు వెలుగులోకి వస్తాయి? సీసీ కెమెరా ఫుటేజ్ పరిశీలనకు అధికారులు సిద్ధమా?ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని, నిబంధనల ఉల్లంఘనలు నిర్ధారణ అయితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నేరాల నివారణకు 'కమ్యూనిటీ కనెక్ట్'

● తొలుత తొమ్మిది పోలీస్ స్టేషన్ల పరిధిలో అమలు

● వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత



వరంగల్, అక్టోబర్ 31

నేరాల నివారణలో ప్రజలను భాగస్వాములను చేసేందుకు 'కమ్యూనిటీ కనెక్ట్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత తెలిపారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యమిస్తూ పోలీసులు నేరుగా ఇళ్ల వద్దకు వెళ్లి వివిధ నేరాలు, మోసాల నివారణపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సైబర్ నేరాలు, సోషల్ మీడియా మోసాలు, మహిళలు, చిన్నారుల భద్రత, ఆస్తి సంబంధిత నేరాలు, దృష్టి మరల్చి చేసే దొంగతనాలపై ప్రజలకు వివరించనున్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల దుష్ప్రభావాలతో పాటు సీసీ కెమెరాల ఏర్పాటు ప్రాముఖ్యతను తెలియజేయనున్నారు. అపరిచితులకు బ్యాంకింగ్ వివరాలు, ఓటీపీలు, వ్యక్తిగత సమాచారాన్ని వెల్లడించవద్దని కమిషనర్ సూచించారు. అనుమానాస్పద కార్యకలాపాలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.తొలుత వరంగల్ నగరంలోని తొమ్మిది పోలీస్ స్టేషన్ల పరిధిలో కార్యక్రమాన్ని అమలు చేసి, అనంతరం కమిషనరేట్‌లోని అన్ని పోలీస్ స్టేషన్లకు విస్తరిస్తామని తెలిపారు. పోలీసులకు, ప్రజలకు మధ్య సంబంధాలను బలోపేతం చేయడమే కార్యక్రమ ప్రధాన లక్ష్యమన్నారు. ప్రజల భాగస్వామ్యం, అప్రమత్తతతో నేరరహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

సింగూర్ నుంచి మంజీరాకు 0.15 టీఎంసీల నీటి విడుదల

దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక





సంగారెడ్డి, అక్టోబర్ 31 : తాగునీటి అవసరాల నిమిత్తం పుల్కల్ మండలంలోని సింగూర్ ప్రాజెక్టు నుంచి మంజీరా బ్యారేజ్‌కు 0.15 టీఎంసీల నీటిని విడుదల చేస్తున్నట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. శనివారం మధ్యాహ్నం 12 గంటల తర్వాత ప్రాజెక్టు గేట్ల ద్వారా నీటి విడుదల ప్రారంభమైందని పేర్కొన్నారు.మధ్యాహ్నం 1.55 గంటలకు ప్రాజెక్టులోని 4, 6, 7వ గేట్లను 1.5 మీటర్ల మేర ఎత్తి, 11,310 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వివరించారు. మొత్తం 0.15 టీఎంసీల నీటిని మంజీరా బ్యారేజ్‌కు విడుదల చేసే ప్రక్రియ కొనసాగుతోందన్నారు.నీటి విడుదల నేపథ్యంలో ప్రాజెక్టు దిగువ ప్రాంతాల్లో నివసించే ప్రజలు, రైతులు, మత్స్యకారులు, పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. నదీ పరివాహక ప్రాంతంలోకి వెళ్లకుండా తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఇందిరాగాంధీ, సర్దార్ పటేల్‌కు ఘన నివాళులు

● కాశిబుగ్గ, కొత్తవాడ కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య

వరంగల్, అక్టోబర్ 31

మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 42వ వర్ధంతి, దేశ తొలి ఉప ప్రధాని, హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని శనివారం కాశిబుగ్గ సెంటర్‌లో నివాళి కార్యక్రమం నిర్వహించారు. మాజీ కౌన్సిలర్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి ధూపం సంపత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇందిరాగాంధీ విగ్రహానికి, సర్దార్ పటేల్ చిత్రపటానికి పుష్పాంజలి సమర్పించి ఘన నివాళులర్పించారు. అనంతరం 23వ డివిజన్ కొత్తవాడలో మాజీ కార్పొరేటర్ దామెర సర్వేశం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సారయ్య పాల్గొన్నారు. అక్కడి ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమాల్లో పీసీసీ సభ్యుడు నల్లగొండ రమేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బసవరాజ్ కుమార్ స్వామి, మాజీ కార్పొరేటర్లు గుండేటి నరేంద్ర కుమార్, బస్వరాజు శిరీష శ్రీమాన్, తత్తరి లక్ష్మణ్, దామెర సర్వేశం, జన్ను రవి, డీసీసీ ప్రధాన కార్యదర్శి గోరంట్ల రాజు, యూత్ కాంగ్రెస్ నాయకుడు వరుణ్ పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకులు నారగోని మురళి గౌడ్, రామా యాదగిరి, కొమ్ముల సందీప్, మార్తా ఆంజనేయులు, వెల్దండి లక్ష్మణ్, జంజీరాల వేణు, రాముల బాబు, బైరబోయిన చంద్రమౌళి, కాశెట్టి వేణు, గుత్తికొండ తిరుపతి, బోలుగొద్దు అనిల్, బత్తుల వినోద్, నరిగే శ్రీనివాస్, కూచన రవీందర్, సింగారపు చిరంజీవి, ఎస్‌కే ఇమ్రాన్, క్యాతం

విశ్వశ్రీ రెసిడెన్సీ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

● అధ్యక్షుడిగా విజయభాస్కరరెడ్డి.. ప్రధాన కార్యదర్శిగా కుమారస్వామి





అక్టోబర్ 31

విశ్వశ్రీ రెసిడెన్సీ ఓనర్స్ సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మావురపు విజయ భాస్కరరెడ్డి, ఉపాధ్యక్షుడిగా రుద్రోజు ప్రవీణ్, ప్రధాన కార్యదర్శిగా రాచర్ల కుమారస్వామి, సంయుక్త కార్యదర్శిగా సయ్యద్ అహ్మద్, కోశాధికారిగా శ్రీరామోజు విద్యాసాగర్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా బి. లక్ష్మణ్, ఇంజనీర్ కంకల సదానందం, ఎం. నారాయణ, ఆడెపు నాగరాజు, ఎన్. దేవేందర్, కె. శ్రీనివాస్, కె. సత్యనారాయణ, వి. సాయికుమార్, కానోజ్ వెంకటాచారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ.. నవంబర్‌లో అపార్ట్‌మెంట్‌లో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. యజమానులందరూ ప్రతి నెలా 10వ తేదీలోపు నిర్వహణ రుసుమును కోశాధికారికి చెల్లించాలని కోరారు. మిషన్ భగీరథ నీటి సరఫరా తక్కువగా ఉన్న నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్‌ను కలిసి సమస్యను వివరించాలని నిర్ణయించారు.అపార్ట్‌మెంట్ అభివృద్ధికి యజమానులందరూ సహకరించాలని, సలహాలు, సూచనలు అందించాలని కోరారు. వాటిని పరిగణనలోకి తీసుకుని సమష్టిగా ముందుకు సాగుతామని తెలిపారు. గత కమిటీ అందించిన సేవలకు నూతన కమిటీ ధన్యవాదాలు తెలిపింది.

కాలనీ చరిత్ర తెలుసుకొని మాట్లాడాలి: కాలనీవాసులు

ఎమ్మెల్యే నాయిని వ్యాఖ్యలపై చెరబండరాజు నగర్ వాసుల అభ్యంతరం





హనుమకొండ, అక్టోబర్ 31

చెరబండరాజు నగర్ కాలనీ చరిత్ర తెలుసుకొని మాట్లాడాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి కాలనీవాసులు సూచించారు. ఆయన వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ పత్రికా ప్రకటన విడుదల చేశారు.తాము 2003లో పట్టాలు పొంది, అప్పటి నుంచి కాలనీలో నివసిస్తున్నామని పేర్కొన్నారు. తమ హక్కుల పరిరక్షణ కోసం చట్టాన్ని ఆశ్రయించామని, న్యాయస్థానాల ద్వారా రక్షణ కోరుతున్నామని తెలిపారు. తమకు సంబంధించిన అంశాలపై అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.మాదిగల పట్ల ఎమ్మెల్యే వివక్షతో వ్యవహరిస్తున్నారని కాలనీవాసులు ఆరోపించారు. తమ నివాసాలు, హక్కుల జోలికి వస్తే చట్టబద్ధంగా పోరాడతామని స్పష్టం చేశారు. నిరుపేదలైన తమకు రక్షణ కల్పించి, హక్కులను గౌరవించాలని కోరారు.

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం
ఆదివారం,
నవంబర్ 01 2026

డీఈఓ ల మార్పు ఎందుకు?

కరీంనగర్ అంటే అధికారులకు భయమా?

(రావుల రాజేశం జోర్దార్)అనాటి తెలంగాణ ఉద్యమం నుండి ఉద్యమాల పురిటిగడ్డగా పేరుగాంచిన కరీంనగర్ విద్యాశాఖలో ఎప్పుడూ ముసలం నిరంతరంగా ఊగిసలాడుతూనే ఉంటుంది. ఇక్కడ సీనియర్లు ఉండిపోవడం, తల పండిన ఉపాధ్యాయ సంఘాల నేతలు ఉండడం కారణమా? అవినీతి అధికారులు, అర్హత లేని అధికారులు విద్యాధికారులుగా రావడమా? అన్నది అంతుచిక్కడం లేదు. ఒకవైపు ఉపాధ్యాయ శిక్షణ డబ్బులు, సర్పంచ్ శిక్షణ, మరోవైపు పదవ తరగతి మూల్యాంకనం, ఎయిడెడ్ ఉపాధ్యాయుల ఫిక్షేషన్ వంటి అనేక అంశాల్లో అడ్డగోలు అవినీతి జరిగినట్టుగా ఆరోపణల నేపథ్యంలో విచారణలు లేకుండా వారానికి ఒక డీఈవో చొప్పున మారుతుండటం విచిత్రంగా తోస్తున్నది. వర్క్ అడ్జస్ట్మెంట్ లో, డిప్యూటేషన్ లలో, చివరకు ఇంచార్జెస్ విషయంలో, ఆర్డీల విషయంలో ఇష్టారాజ్యంగా వ్యవహారం జరుగుతున్నది. ప్రగతిలో వెనకబడి ఉన్న ఎఫ్ ఎల్ ఎన్, ఎల్ ఇ పి వంటి అంశాల్లో ఏలాంటి సృజనాత్మక వినూత్న కార్యాచరణ లేదు. పక్క పెద్దపల్లి జిల్లాలో అనేక కొత్త కొత్త అంశాలు నిర్వహిస్తూ ప్రగతిలో ముందడుగు వేస్తుండగా, నోడల్ జిల్లాగా ఉన్న కరీంనగర్ కేవలం ఉపాధ్యాయ సంఘాల రాజకీయాలకు, ఒకరిపై ఒకరు ఫిర్యాదులు, బెదిరింపులు చేసుకోవడం మాత్రమే జరుగుతున్నది.

ఏండ్లు గడిచినా నేరస్థులపై చర్యలు లేకుండా సాగుతున్నది. ఉపాధ్యాయుల సొమ్ము దుర్వినియోగం కేసు మూడేండ్లు గడుస్తున్నా ఆ అధికారికే ఇంకొన్ని స్కూళ్ల పెత్తనం అప్పగించడం విడ్డూరం. ఇక పీఎం శ్రీ బడులు, కేజీబీవీల్లో నిధుల దుర్వినియోగం వంటి అంశాలు అలాగే ఉండిపోవడం మరొకవైపు విద్యాధికారులు మారుతూ ఉండడం పరస్పర సంబంధం ఉందా అన్న అనుమానం కలుగుతున్నది.

జనార్దన రావు బెదిరింపులు, మెమోలు, సస్పెన్షన్ల నుండి ఊపిరి పీల్చుకున్న ఉపాధ్యాయ వర్గం కాస్త రిలాక్స్ అయినట్టుగా కనిపిస్తున్నది. కొందరు ఉపాధ్యాయులు, అధికారులు, ముఖ్యంగా కాంప్లెక్సు అధికారులు ఇష్టారాజ్యంగా ఎఫ్ ఆర్ ఎస్ వేసుకొని బయట తిరుగుతుండడం, లేదా ఆఫీస్ వర్క్ అంటూ మూవ్మెంట్ లో రాస్తూ సొంత పనులు చేసుకోవడం, పైరవీల కోసం తిరుగుతూ ఉండడం కనిపించింది. మానకొండూరు మండలంలోని ఒక గెజిటెడ్ హెడ్ మాస్టర్ రోజులో కేవలం ఒక్కపూట మాత్రమే బడులు పర్యవేక్షణ చేస్తూ మరొకపూట ఇష్టారాజ్యంగా జిల్లా కేంద్రంలో తిరుగుతున్న ఆధారాలు బయటకు వచ్చాయి. మండల విద్యాధికారులు సైతం సొంత పనులు, యూనియన్ పనులు వెలగబెట్టుకోవడం, మండలంలో అడిగితే జిల్లాలో ఉన్నామని, బడిలో అడిగితే మండలంలో ఉన్నాం అని చెప్తున్నట్టు వార్తలు ఉన్నాయి. ప్రతిరోజూ ఉపాధ్యాయుల హాజరు మానిటర్ చేస్తున్న రీతిలో కాంప్లెక్సు అధికారులు మరియు మండల విద్యాధికారుల హాజరు లొకేషన్ విచారణ చేయాలని సంఘాల బాధ్యులు అడుగుతుండడం వెనక యోగ్యమైన డీఈవో లేక పోవడమే అని కొట్టొచ్చినట్టు కనపడుతుంది.

కేవలం ఐదు నెలలు మాత్రమే మిగిలిన సమయంలో విద్యార్థుల ప్రగతి మీద ఇప్పటికైనా దృష్టి సారించాలని విద్యాభిమానులు, విద్యార్థి సంఘాలు కోరుతున్నారు. తనిఖీ చేస్తున్న వారిని కూడా యాదృశ్చికంగా పర్యవేక్షణ చేయాలని, ఆ మానిటరింగ్ టీమ్స్ సైతం తమకు అనుకూలమైన వారిని ఒక మాదిరిగా, తమకు నచ్చని పాఠశాలను మరొక మాదిరిగా చూస్తున్నారని ఆక్షేపణలు ఉన్నాయి.

అన్నిటిని చూడాల్సిన డీఈవో పోస్టు లేకపోవడం, కొన్ని రోజులు పనిచేసిన చైతన్య జైనీ ఫైళ్లు పెండింగ్ లో పెట్టడం, దుర్భాషలాడడం, అగ్రెసివ్ గా ఉండడం, తరచూ అనారోగ్యం బారిన పడడం, కార్యాలయం సిబ్బందితో, స్పెషల్ ఆఫీసర్లతో సమన్వయం లోపించిన కారణంగా సుమారు ఏడాదిన్నర నుండి జిల్లా విద్యాశాఖ గాడి తప్పినట్టుగా భావిస్తున్నారు. ఇప్పటికైనా అన్ని జిల్లాల్లో రెగ్యులర్ డీఈవో పోస్టులను విద్యా శాఖ అధికారులతో భర్తీ చేయాలని, విద్య కోసం పాటుపడుతున్నట్లు చెప్పుకుంటున్న ప్రభుత్వం టీచర్ పోస్టులు,

లెక్చరర్లు, డైట్ కేంద్రాల్లో పోస్టుల భర్తీ చేయాలని, ఇంటర్ విద్యలో ఉన్న అవినీతి బదిలీలు,

పదోన్నతులు, ఇంక్రిమెంట్లు వంటి పలు అంశాలపై చర్యలు తీసుకోవాలని, వెంటనే ఒక విద్యాశాఖ మంత్రి అవసరం ఉందన్న సోయి కి రావాలని తెలంగాణ ప్రజలు కోరు కుంటున్నారు. అన్నిటికి మూలబిందువుగా ఉండే కరీంనగర్ జిల్లా విద్యా శాఖను అనాథలా పడేయడం సరైనది కాదని, ఈ జిల్లా నుండి ఎక్కువగా ప్రభుత్వం పార్టీ శాసనసభ్యులు లేకపోవడమే ఈ నిర్లక్ష్యానికి కారణంగా కనపడుతుంది.

డీఈఓ లేకపోవడంతో కొందరు సంఘాల నేతలు, ఉద్యోగ విర మణ పొందిన సీనియర్లు చక్రం తిప్పుతూ బెది రింపులకు పాల్పడుతున్నట్లు కనపడుతుంది.

వెంటనే ఒక సరైన అధికారిని డీఈవో గా నియామకం చేయడంతో పాటు ఎఫ్ ఎల్ ఎన్, ఎల్ ఇ పితో పాటుగా పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో నిర్మాణాత్మక చర్యలు తీసుకోవాలని అందరూ కోరుకుంటున్నారు

సర్దార్ వల్లభాయ్ పటేల్

సేవలు చిరస్మరణీయం



- దేశ ఐక్యత కోసం ఆయన చేసిన కృషి ఆదర్శనీయం
- బీసీ జేఏసీ నాయకులు

హుజురాబాద్,జోర్దార్ ప్రతినిధి:హుజురాబాద్ పట్టణంలోని స్థానిక గ్రంథాలయంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ 151వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ కృషీవలుడు తిరునగరి రమేష్, గ్రంథాలయ అధికారి విప్ప పద్మ ఆధ్వర్యంలో పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా బీసీ జేఏసీ గౌరవ అధ్యక్షుడు చందుపట్ల జనార్దన్, అధ్యక్షుడు సందేల వెంకన్న మాట్లాడుతూ.. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. స్వాతంత్ర్యం అనంతరం దేశంలోని 560 సంస్థానాలను, హైదరాబాద్ సంస్థానంతో సహా భారత యూనియన్‌లో విలీనం చేసి జాతీయ సమైక్యతకు కృషి చేసిన ఉక్కుమనిషి అని కొనియాడారు.ఆయన సేవలకు గుర్తింపుగా 1991లో భారతరత్న పురస్కారం ప్రకటించారని, గుజరాత్‌లో ప్రపంచంలోనే ఎత్తైన విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో పాటు ఆయన జయంతిని జాతీయ ఐక్యతా దినోత్సవంగా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. పటేల్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని భావితరాల్లో దేశభక్తి, ఐక్యతాభావాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ ప్రధాన కార్యదర్శి ఇప్పకాయల సాగర్, ఉపాధ్యక్షుడు కొలిపాక క్రాంతికుమార్, తాటిపాముల కనకయ్య, దొంత హరికిషన్, గంగిశెట్టి జగదీశ్వర్, గాజర్ల బుచ్చిరాజం, శ్రీపాద వెంకటేష్, జి. వెంకటయ్య, జె. అనిల్, కొలిపాక రంగయ్య, ఎం. జ్యోతి, బుర్రి శేఖర్, జె. సత్యనారాయణ, గాదె శ్రీనివాస్, చీకోటి రమేష్, కే. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యత దినోత్సవం సందర్భంగా

విద్యార్థులకు పరుగు పోటీలు



- విజేతలకు బహుమతులు అందజేసిన మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్

హుజురాబాద్:జోర్దార్ ప్రతినిధి:సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి, జాతీయ సమైక్యత దినోత్సవం సందర్భంగా హుజురాబాద్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం బాలబాలికలకు పరుగు పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనగా, విజేతలైన నలుగురికి ట్రస్ట్ నిర్వాహకులు, సామాజిక కార్యకర్త డాక్టర్ గంగిశెట్టి జగదీశ్వర్, ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి చేతుల మీదుగా షీల్డులు అందజేశారు.

ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. దేశంలోని 560కి పైగా సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసి జాతీయ ఐక్యతకు సర్దార్ వల్లభాయ్ పటేల్ విశేష కృషి చేశారని తెలిపారు. విద్యార్థుల్లో దేశభక్తి, ఐక్యతాభావం పెంపొందించేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ సేవలను అభినందించారు.పోటీల్లో విజేతలైన సాకేత్, మనోజ్ కుమార్, సింధు, అమూల్యలను ఉపాధ్యాయులు అభినందించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పవన్ కుమార్, వెంకటేష్, సంజీవ్, విద్యార్థులు పాల్గొన్నారు.

కోల్ ఇండియా స్థాయి పోటీల్లో సత్తా చాటాలి

- క్రీడాకారులకు ఎస్పీటుజీఎం ఎం. రామ్మోహన్ పిలుపు
- భూపాలపల్లి జట్టుపై ఐదు పరుగుల తేడాతో ఆర్జీ-3 జట్టు ఓటమి

రామగిరి జోర్దార్ ప్రతినిధి:రామగుండం-3: సింగరేణి క్రీడాకారులు నిరంతరం సాధన చేస్తూ తమ క్రీడా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని, కోల్ ఇండియా స్థాయిలో నిర్వహించే పోటీల్లో ప్రతిభ చాటి సంస్థకు మంచి పేరు తీసుకురావాలని రామగుండం-3 ఏరియా ఎస్పీటుజీఎం ఎం. రామ్మోహన్ పిలుపునిచ్చారు.రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్టు ఏరియాలోని వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో ఆర్జీ-3, అడ్రియాల ప్రాజెక్టు, భూపాలపల్లి ఏరియాల క్రీడాకారుల మధ్య ప్రాంతీయ స్థాయి క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను ముఖ్య అతిథిగా హాజరైన ఎం. రామ్మోహన్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ ఉద్యోగుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు ప్రతి సంవత్సరం వివిధ క్రీడా పోటీలను నిర్వహిస్తోందన్నారు. ఉద్యోగులు విధి నిర్వహణతో పాటు క్రీడలపైనా ఆసక్తి పెంచుకోవాలని సూచించారు.



నిరంతర సాధనతో ప్రతిభను మెరుగుపరుచుకొని కోల్ ఇండియా స్థాయి పోటీల్లో విజయం సాధించే దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

ఉత్కంఠ పోరులో భూపాలపల్లి విజయం

క్రికెట్ పోటీల్లో తొలుత బ్యాటింగ్ చేసిన భూపాలపల్లి జట్టు 201 పరుగులు సాధించింది. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన ఆర్జీ-3 జట్టు చివరి వరకు పోరాడినప్పటికీ ఐదు పరుగుల తేడాతో ఓటమి పాలైంది. దీంతో భూపాలపల్లి జట్టు విజయం సాధించింది.

ఈ కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు ఎం. రామచంద్రారెడ్డి, కోట రవీందర్‌రెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షుడు కోల శ్రీనివాస్, స్పోర్ట్స్ గౌరవ కార్యద ర్శి ఎన్. వంశీధర్, క్రీడల సమన్వయకర్త బుర్ల సదానందం, ఇతర నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రేమ్ వర్ధంతి సందర్భంగా అన్నదానం



హసన్ పర్తి,జోర్దార్ ప్రతినిధి:భీమారం ముద్దుబిడ్డ ప్రేమ్ ప్రథమ వర్ధంతిని గురువారం కుటుంబ సభ్యులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సమాధి వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించి, మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు.తాజా మాజీ కార్పొరేటర్ జక్కుల రజిత వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జక్కుల వెంకటేశ్వర్లు (శ్రీను) మాట్లాడుతూ.. ప్రేమ్ ప్రేమాభిమానాలతో అందరికీ సహాయం చేస్తూ ప్రజల మనసుల్లో చెరగని స్థానం సంపాదించు కున్నారని కొనియాడారు. ప్రేమ్ ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని జక్కుల రజిత వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సంఘాల రవి, పాస్టర్ సంగాల బాబు, సంఘాల కోటేశ్వర్ అభిమానులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఉస్మాన్ పాషాకు అభినందన సభ



హుజురాబాద్,జోర్దార్ ప్రతినిధి:తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన మహమ్మద్ ఉస్మాన్ పాషాకు హుజురాబాద్‌లో ఘన సన్మానం నిర్వహించనున్నారు. ఈ మేరకు హుజురాబాద్‌లోని సిటీ సెంట్రల్ హాల్‌లో సంఘం యూనిట్ ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేశారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హోదాలో తొలిసారిగా హుజురాబాద్‌కు వస్తున్న ఉస్మాన్ పాషాను రాష్ట్ర సంఘం అధ్యక్షుడు పేరి వెంకట్ రెడ్డి చేతుల మీదుగా సత్కరించనున్నట్లు యూనిట్ అధ్యక్షుడు గంజి జయవర్ధన్, ప్రధాన కార్యదర్శి కోయల్‌కార్ దుర్గాజీ, కార్యవర్గ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమానికి పెన్షనర్లు,సంఘం సభ్యులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అక్రమ సంబంధాలతో

కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి

మన దేశంలో ప్రజలు బినత్వంలో ఏకత్వం అనే విదంగా కలిసి మెలిసి జీవిస్తారు. గ్రామీణ ప్రాంతాలలో అయితే ప్రజలు ఎక్కువగా వ్యవసాయం పై ఆదారపడి జీవిస్తున్నారు. పూర్వ కాలంలో మనుషులు ప్రేమతో కలిసి మెలిసి ఉండేవారు. టెక్నాలజీ పెరిగింది కావున మనిషిలో స్వార్థం కూడా పెరిగింది. ఎవరికీ వారే చూసుకుంటూనారు. పక్క వాడి గురించి ఆలోచన చేయడం లేదు. పూర్వ కాలంలో ఒకరికి ఒకరు గౌరవంగా పిలుచుకునేవారు. మర్యాదగా మాట్లాడేవారు. తప్పుడు ఆలోచనలు చేసేవారు కాదు. వావి వరుసలతో పిలుచుకునే వారు. అక్క, తమ్ముడు, అన్న, మామ, చిన్నాన, పెద్ద నాన్న, అత్తమ్మ, ఇలా రక రకాల వరుసలతో పిలుచుకునేవారు. ఇపుడు స్మార్ట్ ఫోన్ ప్రబల్యం పెరిగింది. అన్ని అబద్దాలు, చెప్పడం మోసాలు చేయడం, తప్పుడు పనులు చేయడం, తప్పుడు బుద్దితో చూడటం, తప్పుగా ప్రవర్తించడం స్మార్ట్ ఫోన్ లో చూసి నేర్చుకుంటున్నారు వరుసలు చూడటం లేదు. కామంతో రగిలిపోతున్నారు. వయస్సు తో సంబంధం లేదు. కోరికలు తీర్చుతే చాలు వాడు ఎలాంటి వాడైనా పరవాలేదు. ఈరోజు చాలా మంది ఆడవాళ్లు 20-60ఏళ్ల వయస్సు వాళ్ళు తప్పుడు పనులు చేస్తున్నారు. ఒకరు పేదరికంతో బ్రతకడానికి వ్యభిచారం చేస్తుంటే మరొకరు బలిసి కామం ఎక్కువై చేస్తున్నారు. ఇంకా ఒకరు ఎంజాయ్ చేయడానికి ఈవిధంగా చేయడం వలన వాళ్లకు పుట్టిన పిల్లలు ఎం కావాలి. ఆలోచన చేయడం లేదు. మగ వాళ్ళు ఆడ వాళ్లను అవసరం ఉనంత వరకు వాడుకొని వదిలేస్తారు. అలాగే కొంత మంది వ్యభిచారానికి అలవాటు పడి అటు భర్తకు దూరం కాలేక ఇటు ఉంచుకున్న ప్రియుడు కి దూరం కాలేక ఇద్దరితో కలిసి సంసారం చేయలేక. భర్తతో చాలా ఏళ్ళు కలిసి ఉండడంతో బోర్ కొట్టి కొత్త రుచులతో అలరించే ప్రియుడి మోజులో పడి తాళి కట్టిన భర్తనే చంపుకొని జైలు పాలు అవుతున్నారు క్షనికమైన సుఖం కోసం వారికి పుట్టిన పిల్లల బంగారం లాంటి జీవితాలను రోడ్డు పాలు చేసుకొని పిల్లలను అనాదాలను చేస్తున్నారు ఇది ఎంతవరకు న్యాయం. ఆలోచన చేయాలి ప్రతి ఒక్కరు. ఆడవాళ్లు మరిది తో అల్లుడు తో మామ లతో ఇలా వావి వరుసలు మరిచి అక్రమ సంబంధాలు పెట్టుకుంటున్నారు ఇది ఎంతవరకు సమంజసం.


చదువుకున్నవారు, చదుకొని వారు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు అందరు ఈవిదంగా అక్రమ సంబంధాలు నేరుపుతున్నారు. ఇది మంచి పద్ధతి కాదు కోర్టులు, చట్టాలు, పోలీసులు వీటి పైన అవగాహన కార్యక్రమం చేయాలి.

మీటింగులు ఏర్పాటు చేయాలి ఎంతో మంది వీటి వల్ల ఆడ వారు చనిపోయారు అలాగే మగ వాళ్ళు చనిపోయారు.సోషల్ మీడియా ద్వారా మరియు సినిమాల ద్వారా అవగాహనా కార్యక్రమం చెప్పట్టాలి చట్టాలు కఠినంగా ఉండాలి. కఠినమైన శిక్షలు విధించాలి అపుడే మార్పు వస్తుంది.



Dr. మధుసూదనగౌడ్
సింగోటం(జ)కొల్లాపూర్ (ఎ)
నాగర్ కర్నూల్ (జిఐ)
9908677543.

ఇందిరా గాంధీ వర్ధంతి వేడుకలు



మొగుళ్లపల్లి,జోర్దార్ ప్రతినిధి:మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ ఇందిరా గాంధీ 42వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మహమ్మద్ రఫీతో పాటు పార్టీ నాయకులు ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం మహమ్మద్ రఫీ మాట్లాడుతూ దేశ అభివృద్ధికి, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ఇందిరా గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆమె ఆశయాలను కొనసాగిస్తూ రాహుల్ గాంధీని భవిష్యత్తులో ప్రధానమంత్రిగా చూడటమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి నడిగోటి రాము, టౌన్ అధ్యక్షుడు రమేష్, జిల్లా నాయకులు ఏలేటి శివారెడ్డి, బండి సుదర్శన్ గౌడ్, చాట్ల రవీందర్, లింగమూర్తి, ఉపసర్పంచ్ నీల రాజు తదితరులు పాల్గొన్నారు.

హుజురాబాద్‌లో ఎన్ఎంఎంఎస్

పరీక్షకు ఏర్పాట్లు పూర్తి



హుజురాబాద్,జోర్దార్ ప్రతినిధి:హుజురాబాద్ పట్టణంలో నవంబర్ 1న నిర్వహించనున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాధికారి విడపు శ్రీనివాస్ తెలిపారు. పరీక్ష కోసం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జెడ్పీహెచ్ఎస్ గర్ల్స్ పాఠశాలల్లో రెండు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రంలో 191 మంది, జెడ్పీహెచ్ఎస్ గర్ల్స్ కేంద్రంలో 191 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. రెండు కేంద్రాల్లో కలిపి మొత్తం 382 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎనిమిది గదులు, ఎనిమిది మంది ఇన్విజిలేటర్లు, ఒక క్లర్క్, ఒక రిలీవర్‌ను నియమించారు. గర్ల్స్ పాఠశాల కేంద్రంలో ఏడు గదులు, ఏడుగురు ఇన్విజిలేటర్లు, ఒక క్లర్క్, ఒక రిలీవర్‌ను ఏర్పాటు చేశారు.ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్‌గా చేల్మల్ల సంజీవరెడ్డి, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా చల్లూరి అరుణ్ వ్యవహరించనున్నారు. జెడ్పీహెచ్ఎస్ గర్ల్స్ కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్‌గా గొర్రె చిరంజీవి, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా తిరుపతమ్మ విధులు నిర్వహించనున్నారు.

విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరీక్షను ప్రశాంత వాతావరణంలో, సజావుగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

నిబంధనలకు విరుద్ధంగా
పర్మిట్ రూముల నిర్వహణపై ఫిర్యాదు

■ వైన్స్ యజమానులపై చర్యలు తీసుకోవాలి
■ కొలిపాక సమ్మయ్య



హుజురాబాద్,జోర్దార్ ప్రతినిధి:హుజురాబాద్ పట్టణంతో పాటు మండలంలోని పలు వైన్స్ షాపుల వద్ద ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పర్మిట్ రూములను విస్తరించి, షెడ్లు, కిచెన్లు ఏర్పాటు చేసి అధిక ధరలకు ఆహార పదార్థాలు విక్రయిస్తున్నారని ముదిరాజ్ మహాసభ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు కొలిపాక సమ్మయ్య ఆరోపించారు.ఈ అక్రమాలపై శనివారం కేశవపట్నం క్యాంపులోని ఆబ్కారీ శాఖ కార్యాలయంలో ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. స్పందించిన ఎక్సైజ్ ఎస్ఐ రంజిత్ కుమార్ ఈ విషయాన్ని సీఐ దృష్టికి తీసుకెళ్లి రెండు రోజుల్లో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, హుజురాబాద్ సోషల్ మీడియా కన్వీనర్ తలసి లక్ష్మణమూర్తి పాల్గొన్నారు.

మొగుళ్లపల్లిలో గుడుంబా దందా జోరు
నిద్రావస్థలో ఎక్సైజ్ శాఖ!

■ గ్రామగ్రామాన ప్యాకెట్ల లో అక్రమ విక్రయాలు
■ ప్రజల ఆరోగ్యానికి ముప్పు

మొగుళ్లపల్లి,జోర్దార్ ప్రతినిధి:మొగుళ్లపల్లి మండలంలో గుడుంబా తయారీ, విక్రయాలు మళ్లీ జోరందుకున్నాయనే ఆరోపణలువినిపిస్తున్నాయి. మండలంలోని కొన్ని గ్రామాల్లో గుట్టుచప్పుడు కాకుండా గుడుంబా తయారు చేస్తూ,ప్యాకెట్ల రూపంలో వివిధ గ్రామాలకు సరఫరా చేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రాణాంతకమైన ముడి పదార్థాలతో తయారు చేస్తున్న ఈ గుడుంబా ప్రజల ఆరోగ్యానికి తీవ్ర ముప్పుగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.కొంతమంది వ్యాపారులు ముడి సరుకులను ఇళ్లకు తరలిస్తూ అక్రమ దందాను కొనసాగిస్తున్నారని, అయినప్పటికీ ఎక్సైజ్ అధికారులు పట్టించు కోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.గతంలో గుడుంబా తయారీపై ఆధారపడిన కుటుంబాలకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించి ఈ దందాను నియంత్రించేందుకు అధికారులు చర్యలు చేపట్టిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. ప్రస్తుతం మళ్లీ పెరుగుతున్న అక్రమ తయారీ, విక్రయాలపై ఎక్సైజ్ అధికారులు ప్రత్యేక నిఘా పెట్టాలని,
గుడుంబా తయారీ కేంద్రాలను గుర్తించి దాడులు నిర్వహించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సోషల్ మీడియాలో వచ్చిన
భూ కబ్జాల కథనాలపై స్పందించిన కలెక్టర్

■ కలెక్టర్ ఆదేశాలతో విచారణ నిర్వహించిన బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్.



బెల్లంపల్లి జోర్దార్ ప్రతినిధి:బెల్లంపల్లి మండల కన్నాల శివారు సర్వేనెంబర్ 112 లో జాతీయ రహదారిని ఆనుకుని ప్రభుత్వ భూమిలో 50 లక్షల విలువైన స్థలాన్ని అక్రమంగా కబ్జా చేస్తూ అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని, నిర్మాణాలను తొలగించి ప్రభుత్వ భూములను కాపాడాలని, స్థానిక ఎన్నారై తోడే కృష్ణారెడ్డి, బెల్లంపల్లి నియోజకవర్గ గ్రూపులో పెట్టిన విజ్ఞప్తిని సుమోటోగా తీసుకొని, విచారణ అధికారిగా బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ ను విచారణ నిర్వహించి నివేదిక ఇవ్వాలని కోరిన వెంటనే, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ శనివారం ప్రత్యేకంగా విచారణ నిర్వహించారు, విచారణ నివేదికను త్వరలో కలెక్టర్కు పంపించనున్నట్లు సబ్ కలెక్టర్ మనోజ్ తెలిపారు.

వల్లభాపూర్ పాఠశాలలో
జాతీయ ఐక్యత దినోత్సవం



ఎల్కతుర్తి(జోర్దార్ ప్రతినిధి)వల్లభాపూర్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు బద్దం సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన భారతరత్న సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని జాతీయ ఐక్యత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగాప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు, విద్యార్థులు పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
అనంతరం బద్దం సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం అనంతరం 526 సంస్థానాలను భారతదేశంలో విలీనం చేయడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ కీలక పాత్ర పోషించారని, ఆయన కృషి ఫలితంగానే నేడు ఐక్య భారతదేశాన్ని చూస్తున్నామని తెలిపారు. దేశ సమగ్రత, ఐక్యత, శాంతి కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన దేశభక్తి నేటి తరానికి ఆదర్శమని అన్నారు.
అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులతో జాతీయ ఐక్యత దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, వెంకటస్వామి, పద్మలత, కల్యాణి, రమాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

విజిత్ రావ్ మాటలతో ప్రజలు నవ్వుకుంటున్నారు

■ రాకేష్ రెన్వా



మంచిర్యాల జోర్దార్ జిల్లా ప్రతినిధి:మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే (బిఆర్ఎస్) దివాకర్ రావు కుమారుడు విజిత్ రావు, ప్రెస్ మీట్ పెట్టి మధ్యప్రదేశ్లో బిజెపి ప్రభుత్వం ఫినాయిల్, ఎల్ఈడీ లైట్లు కొనుగోలులో స్కామ్ చేసిందంటూ ఆరోపణలు చేయడం ప్రజలు నవ్వుకుంటున్నారని, మంచిర్యాల జిల్లా బిజెపి అధికార ప్రతినిధి రాకేష్ రేన్వా హేళన చేశారు.
శనివారం జిల్లా బిజెపి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, మధ్యప్రదేశ్లో గత 21 సంవత్సరాలుగా బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉందని, ఈ కాలంలో ప్రవేశపెట్టిన మొత్తం బడ్జెట్ సుమారు 25 లక్షల కోట్లుగా ఉందని, అందులో పెనాయిల్కు 33,000, ఎల్ఈడీ బల్బులకు 11,800 స్కాం జరిగిందని ఆరోపించడం సిగ్గుచేటని విమర్శించారు.బీజేపీ అవినీతి గురించి మాట్లాడే ముందు ఎల్లంపల్లి దివాకర్ రావు అనే పేరు మీ నానాకి ఎలా వచ్చిందో ప్రజలకు వివరించాలని, ముందుగా ఎల్లంపల్లి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. దివాకర్ రావు ఎమ్మెల్యేగా ఉన్నపుడు మంచిర్యాల మున్సిపాలిటీ లో మంచినీళ్ల సరపరాకు వినియోగించే వాటర్ ట్యాంకులకు, చెత్త బుట్టలు కొనుగోలు లో, ప్రతి దానిలో అవినీతిలో పాలుపంచుకున్నాడని, తెలిపారు..
బీజేపీపై అవినీతి ఆరోపణలు చేస్తే ప్రజలు నవ్వుకుంటారని, ఆధారాలు లేని ఆరోపణలు చేయడం మానుకోవాలని ఆయనకు హితవు పలికారు.

బీజేపీ సంస్థాగత బలోపేతానికి
బూత్ అధ్యక్షుల నియామకం



■ నవంబర్ 5న కరీంనగర్లో మహా పాదయాత్రను విజయవంతం చేయాలి
■ పట్టణ అధ్యక్షుడు తూర్పాటి రాజు

హుజురాబాద్,జోర్దార్ ప్రతినిధి:భారతీయ జనతా పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయడంలో భాగంగా హుజురాబాద్ పట్టణంలోని 29, 47, 63వ బూత్లకు నూతన అధ్యక్షులను నియమించినట్లు బీజేపీ పట్టణ అధ్యక్షుడు తూర్పాటి రాజు తెలిపారు. 29వ బూత్ అధ్యక్షుడిగా బెజ్జంకి రాజేందర్, 47వ బూత్ అధ్యక్షుడిగా పల్లెపు భాస్కర్, 63వ బూత్ అధ్యక్షుడిగా దొరి ఐలయ్యలను నియమించారు.ఈ సందర్భంగా తూర్పాటి రాజు మాట్లాడుతూ బూత్ స్థాయి కమిటీలే పార్టీకి పునాదులని, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు.అలాగే నవంబర్ 5న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో కరీంనగర్లో నిర్వహించనున్న మహా పాదయాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ప్రజల్లో చైతన్యం కోసం నిర్వహించే ఈ కార్యక్రమానికి హుజురాబాద్ నుంచి నాయకులు,
కార్యకర్తలు, యువత అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు.
ఈ కార్యక్రమంలో శక్తి కేంద్ర ఇన్చార్జి యాళ్ల సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శులు గంట సంపత్, తిప్పబత్తిని రాజు, సీనియర్ నాయకులు అంకతి వాసు, డి. అశోక్, బూత్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

స్వదేశీ ఖాదీ వస్త్రాలనే కొనుగోలు చేయండి



■ స్వదేశీ ఉత్పత్తుల్లోనే స్వచ్ఛత ఉంటుంది.
■ బెల్లంపల్లి ఏరియా జిఎం ఎం రమేష్.

బెల్లంపల్లి జోర్దార్ ప్రతినిధి:ఖాదీ వస్త్రాలనే కొనుగోలు చేయాలని, స్వదేశీ వస్తువులే స్వచ్ఛంగ, నాణ్యతగా ఉంటాయని, బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం, శ్రీరమేష్ అన్నారు.
శనివారం గోలేటి సి ఈ ఆర్ క్లబ్ లో వావిలాల ఖాదీ గ్రామోద్యోగ్ ప్రతిష్ఠాన్ వారు ఏర్పాటు చేసిన ఖాదీ మేళ స్టాల్ ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, వావిలాల ఖాదీ వస్త్రాలు ఎంతో నాణ్యతగా, అందంగా, మన్నికగా ఉంటాయని కార్మికులు వారికి అవసరమైన వస్త్రాలను కొనుగోలు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం స్టాల్లోని వస్త్రాలను పరిశీలించి రాయితీ వివరాలు ఉద్యోగులకు వివరించాలని నిర్వాహకులకు విజ్ఞప్తి చేశారు.
నవంబర్ 7 వ తేదీ వరకు మేలా ఉంటుందని, ప్రతిరోజు ఉదయం 9 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు మేళా నిర్వహించ బడుతుందని తెలిపారు.ఖాది వస్త్రాల కొనుగోలుపై 25 నుండి 30 శాతం వరకు రాయితీ ఉంటుందని, 20 వేల వరకు వస్త్రాలను క్రెడిట్ పై అందిస్తామని 5 వాయిదాలలో జీతం నుండి పే స్లిప్ ద్వారా చెల్లింపు అవకాశం ఉంటుందని వివరించారు.
ఈ కార్యక్రమంలో ఏఐటియుసి బ్రాంచి కార్యదర్శి ఎస్ తిరుపతి , ఏరియా ఇంజినీర్ వీరన్న , డీజీఎం (ఐ ఈ డి)
ఉజ్వల్ కుమార్ బెహరా, సీనియర్ పర్సనల్ అధికారులు ఎం శ్రీనివాస్ , డి ప్రశాంత్ , నిర్వాహకులు చంద్రమౌళి, రాజేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ ను కలిసిన రేణి కుంట్ల ప్రవీణ్



బెల్లంపల్లి జోర్దార్ ప్రతినిధి:మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు,బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంచిర్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, మాజీ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు, రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్టు ఆశిస్తున్న ఆశావాహుడు, బెల్లంపల్లి పట్టణానికి చెందిన రేణి కుంట్ల ప్రవీణ్, తనదైన శైలిలో పలువురు మున్సిపల్ కౌన్సిలర్ల తో కలిసి వెళ్లి శనివారం హైదరాబాద్లో కేటీఆర్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా వారు నియోజకవర్గంలో పార్టీ బలోపేతం, బిఆర్ఎస్ పార్టీలో ఇతర పార్టీల నుండి చేరికల ఏర్పాటు, ఆదివారం ఆదిలాబాద్ లో నిర్వహించనున్న రైతు గర్జన సభ ఏర్పాట్లపై చర్చించినట్లు సమాచారం.
ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కాంపల్లి రాజం డి, రాజ్ కుమార్ పెద్దనపల్లి సర్పంచ్ కల్వల శరత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

హుజురాబాద్ మున్సిపాలిటీలో
సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు



హుజురాబాద్,జోర్దార్ ప్రతినిధి:హుజురాబాద్ మున్సిపల్ కార్యాలయంలో ఉక్కుమనిషి, భారతరత్న సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్ రావు ఆధ్వర్యంలో పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశ సమైక్యత, సమగ్రత కోసం పటేల్ చేసిన కృషిని స్మరించుకుంటూ ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిషన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో
ఇందిరమ్మ పాత్ర మరువలేనిది



హుజురాబాద్,జోర్దార్ ప్రతినిధి:భారతదేశ తొలి మహిళ ప్రధానమంత్రి భారతరత్న స్వర్గీయ ఇందిరాగాంధీ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్ రావు అన్నారు.
శనివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుహాసిని మనోజ్ రావు మాట్లాడుతూ దేశా ఐక్యత సమగ్రతను కాపాడటంతో పాటు భారతదేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఇందిరాగాంధీ విశేష కృషి చేశారని కొనియాడారు.బ్యాంకుల జాతీయికరణ హరిత విప్లవానికి ప్రోత్సాహం వ్యవసాయ రంగా అభివృద్ధి వంటి కీలక నిర్ణయాలతో దేశ ఆర్థిక సామాజిక రంగాల్లో తనదైన ముద్ర వేశారని పేర్కొన్నారు. పేదలు బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఆమె తీసుకుని నిర్ణయాలు దేశ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాయని అన్నారు మహిళా నాయకత్వానికి ఆమె ఆదర్శంగా నిలిచారని దేశం కోసం చేసిన త్యాగాలు సేవలు ఎప్పటికీ ప్రజల హృదయాల్లో నిలిచిపోతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు మేకల తిరుపతి, కౌన్సిలర్లు సొల్లు సునీత, కోయల్ కార్ భారతి, పుణ్య లత, కాలిక్ హుస్సేన్, శ్రీనివాస్, కాజీపేట శ్రీనివాస్, ఉప్పు శ్రీనివాస్, సందమల్ల బాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

స్వీయ గృహ నిర్మాణ ఆప్షన్లకు
నవంబర్ 3 చివరి గడువు

■ అర్హులైన కుటుంబాలు తుది అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి ఐటీడీఏ పీవో నరేంద్ర పడాల్



చింతూరు,ఏపీ స్టేట్ జోర్దార్ బ్యూరో:చింతూరు డివిజన్ పరిధిలోని ఫేజ్--1బి గ్రామాల ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఫైనల్ డ్రాఫ్ట్ అవార్డుల్లో నమోదైన అర్హులైన నిర్వాసిత కుటుంబాలు స్వీయ గృహ నిర్మాణ ఆప్షన్లను ఎంపిక చేసుకునేందుకు నవంబర్ 3, 2026 చివరి గడువుగా నిర్ణయించినట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, ఆర్అండ్ఆర్ అధికారి చిట్టపులి నరేంద్ర పడాల్ తెలిపారు. నాన్-ఎస్టీ నిర్వాసితులు స్వీయ గృహ నిర్మాణ ఆప్షన్లు, ఎస్టీ నిర్వాసితులు ఆప్షన్ ఎంచుకోవచ్చని పేర్కొన్నారు.
ఎస్టీలు ఎంపికకు సంబంధిత పీసా గ్రామసభ తీర్మానం సమర్పించాలన్నారు.
ఇప్పటివరకు అనర్హులుగా గుర్తించిన, కొత్తగా చేర్చాల్సిన కుటుంబాలపై క్షేత్రస్థాయిలో పునర్విచారణ చేపట్టి అర్హుల జాబితాను డిసెంబర్ నెలాఖరులోగా విడుదల చేస్తామని తెలిపారు. సంబంధిత నిర్వాసిత కుటుంబాలు గడువులోగా తమ ఆప్షన్లను నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

ఫోటోగ్రఫీ పోటీలో జిల్లా ప్రథమ బహుమతి
అందుకున్న ఎస్.ఎస్. శేఖర్



జోగులాంబ గద్వాల జోర్దార్ ప్రతినిధి:పోలీస్ అమర వీరుల సంస్మరణ దినోత్సవం, పోలీస్ పతాక దినోత్సవం సందర్భంగా జోగులాంబ గద్వాల జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోటోగ్రఫీ పోటీల్లో జిల్లా ఫోటోగ్రాఫర్ల సంఘం అధ్యక్షుడు, ప్రముఖ ఛాయాగ్రాహకుడు ఎస్.ఎస్. శేఖర్ జిల్లా ప్రథమ బహుమతిని అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ, అదనపు ఎస్పీ చేతుల మీదుగా శేఖర్ ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.
జిల్లాలోని పలువురు ఛాయాగ్రాహకులు ఈ పోటీల్లో పాల్గొనగా, శేఖర్ తీసిన ఛాయాచిత్రం ఉత్తమంగా నిలిచి మొదటి బహుమతిని కైవసం చేసుకుంది.ఫోటోగ్రఫీ రంగంలో ఆయన ప్రతిభను పోలీసు శాఖ గుర్తించి ప్రశంసా పత్రంతో సత్కరించడం పట్ల జిల్లా ఫోటోగ్రాఫర్లు హర్షం వ్యక్తం చేస్తూ శేఖర్కు అభినందనలు తెలిపారు.

ఎంఐఎం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడికి
ముజాహిద్ హుస్సేన్ సన్మానం



హుజురాబాద్,జోర్దార్ ప్రతినిధి:ఎంఐఎం కరీంనగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్‌ను హుజురాబాద్ ముస్లిం మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ జిల్లా పార్టీ కార్యాలయంలో ఆత్మీయంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాలో ముస్లింల సమస్యలు, వక్ఫ్ బోర్డు అంశాలపై నిరంతరం స్పందిస్తూ ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో జమియతుల్ ఉలమా హుజురాబాద్ అధ్యక్షుడు హాఫిజ్ ఇమ్రాన్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

విధుల నిర్లక్ష్యాన్ని సహించేది లేదు



■ అదనపు కలెక్టర్

హుజురాబాద్,జోర్దార్ ప్రతినిధి:ప్రజలకు వైద్య సేవలు అందించడంలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని కరీంనగర్ జిల్లా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే హెచ్చరించారు. శనివారం హుజురాబాద్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి అన్ని వార్డులను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాలపై ఆరా తీశారు. లేబర్ రూమ్ రిజిస్టర్ల నిర్వహణ, మెడికల్ స్టోర్‌లో మందుల నిల్వల వివరాల్లో లోపాలపై సూపరింటెండెంట్ డాక్టర్ రవీందర్‌ను ప్రశ్నించి అసహనం వ్యక్తం చేశారు. వైద్యులు, సిబ్బంది హాజరుపై నిఘా పెట్టేందుకు ఎఫ్‌ఆర్ఎస్ విధానం అమలు చేస్తామని, 15 రోజులకు ఒకసారి తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. నెల రోజుల్లో ఆసుపత్రి పని తీరును మెరుగుపరుస్తామని పేర్కొన్నారు.ఈ తనిఖీలో అసిస్టెంట్ కలెక్టర్ హరిప్రసాద్, ఆర్డీఓ జలకుమారి,
డీసీహెచ్ఎస్ డాక్టర్ కృష్ణప్రసాద్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రభుదాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని, కమిషనర్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు వ్యసనాలకు
యువత దూరంగా ఉండాలి

■ పొగాకు వినియోగంతో ప్రాణాంతక వ్యాధులు

■ విద్యార్థులకు డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య అవగాహన



హనుమ కొండ,జోర్దార్ ప్రతినిధి:జాతీయ పొగాకు రహిత యువత ప్రచార కార్యక్రమం--4.0లో భాగంగా హనుమకొండ జిల్లా నడికూడ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పొగాకు వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ మురళి పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ పొగాకు, గుట్కాఖైనీ,సిగరెట్లు, బీడీల వినియోగంతో నోటి క్యాన్సర్,ఊపిరితిత్తుల క్యాన్సర్,గుండె సంబంధిత, శ్వాసకోశ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. యువత చిన్న వయస్సు నుంచే చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో డాక్టర్ దివ్య, ఎంపీహెచ్ఈఓ రాజ్‌కుమార్, సూపర్‌వైజర్ శ్రీనివాస్ రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి అండగా నిలిచిన
వెంకట్రావుపల్లి గ్రామస్తులు

■ రూ.1,27,620 ఆర్థిక సహాయం అందజేత..

■ కుటుంబ సభ్యులకు ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్ పంపిణీ



టేకుమట్ల జోర్దార్ ప్రతినిధి:భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన కసరవెన కుమార్ ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకుండా గ్రామస్తులందరూ అండగా నిలిచారు.
ఈ క్రమంలో గ్రామస్తులందరూ కలిసి 'మన గ్రామం' వాట్సాప్ గ్రూప్ ద్వారా రూ.1,27,620 విరాళాలను సేకరించారు.
సేకరించిన మొత్తాన్ని కుటుంబ సభ్యుల భవిష్యత్తుకు భరోసాగా ఉండేలా ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి, అందుకు సంబంధించిన బాండ్‌ను గ్రామస్తుల ఆధ్వర్యంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.
కష్టకాలంలో బాధిత కుటుంబానికి అండగా నిలిచి ఆర్థిక సహాయం అందించిన గ్రామస్తుల ఐక్యత, మానవత్వం పలువురి ప్రశంసలు అందుకుంది. మృతుడి కుటుంబానికి గ్రామమంతా అండగా నిలవడం గ్రామ ఐక్యతకు నిదర్శనంగా నిలిచింది.

జూలపల్లిలో ఘనంగా ఉక్కుమనిషి
సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు

■ విద్యార్థులకు జాతీయ ఐక్యతపై సందేశం.. జీవిత చరిత్ర పుస్తకాల పంపిణీ



పెద్దపల్లి జోర్దార్ ప్రతినిధి:భారతదేశ ఐక్యతకు ప్రతీక, ఉక్కుమనిషిగా పేరుగాంచిన స్వాతంత్ర్య సమరయోధుడు, భారత మాజీ ఉప ప్రధాని, భారత రత్న సర్దార్ వల్లభాయ్ పటేల్ 151వ జయంతి వేడుకలను జూలపల్లి మండలంలోని పలు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. జాతీయ ఐక్యత దినోత్సవం (రాష్ట్రీయ ఏక్తా దివస్) సందర్భంగా పాఠశాలల కరస్పాండెంట్ల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర యువజన సంఘాల సమాఖ్య అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు అమరగాని ప్రదీప్ కుమార్ హాజరుకాగా, ముఖ్య వక్తగా నేషనల్ యూత్ ప్రాజెక్ట్ (ఎన్‌వైపీ) రాష్ట్ర అధ్యక్షుడు యాదవ రాజు పాల్గొని విద్యార్థులకు జాతీయ ఐక్యత ప్రాధాన్యతను వివరించారు. స్వాతంత్ర్యం అనంతరం దేశంలోని సంస్థానాలను భారత యూనియన్‌లో విలీనం చేసి, దేశ సమగ్రతకు బలమైన పునాది వేసిన మహనీయుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అని కొనియాడారు.విద్యార్థులకు జీవిత చరిత్ర పుస్తకాల పంపిణీగాంధీ స్మారక నిధి, తెలంగాణ హైదరాబాద్ వారి సహకారంతో ప్రతి పాఠశాలలో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సర్దార్ వల్లభాయ్ పటేల్, మహాత్మా గాంధీ జీవిత చరిత్ర పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా సహకారం, ప్రోత్సాహం అందించిన జి.వి. సుబ్బారావు, కార్యదర్శి రంగారావులకు నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వివేకానంద సందేశంపై అవగాహన

అనంతరం స్వామి వివేకానంద 133వ చికాగో ఉపన్యాస సందేశ ప్రచారంలో భాగంగా విద్యార్థులకు సత్ప్రవర్తన, సచ్చీలం, వ్యక్తిత్వ నిర్మాణం (క్యారెక్టర్ బిల్డింగ్) అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, నైతిక విలువలు, మంచి నడవడిక అలవర్చుకోవాలని సందేశమిచ్చారు.జూలపల్లిలోని జూపిటర్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల, బ్రిలియంట్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. నేషనల్ యూత్ ప్రాజెక్ట్, నిఫా తెలంగాణ, గాంధీ స్మారక నిధి సంయుక్త ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.

ప్రమాదంలో మృతి చెందిన
కిరణ్ కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



జోగులాంబ గద్వాల,జోర్దార్ ప్రతినిధి:మల్దకల్ మండలం శేషంపల్లి సమీపంలో జరిగిన బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అయిజ మండలం చిన్న తాండ్రపాడు గ్రామానికి చెందిన పెయింటర్ కిరణ్ (24) శుక్రవారం రాత్రి మృతి చెందాడు. దీంతో ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య మూడుకు చేరింది.
కిరణ్ మృతి విషయం తెలుసుకున్న ఆలంపూర్ ఎమ్మెల్యే విజయుడు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పి ప్రగాఢ సానుభూతి తెలిపారు.
పోస్టుమార్టం ప్రక్రియ త్వరగా పూర్తయ్యేలా వైద్యులతో మాట్లాడారు. కిరణ్ మృతితో కుటుంబంలో విషాదం నెలకొంది.

"మనకు మనమే మార్చుకోవాలి"

రండి మనల్ని మనమే..
శుభ్రంగా ఉతికి ఆరేసుకుందాం..
సంవత్సరాల నుండి పేరుకు పోయిన..
మానసిక జిడ్డును..
శారీరక రుగ్మతులతో నిండిన...
మలినాలను పదిలించుకుందాం..
మసకబారిన వ్యక్తిత్వాన్ని కడిగేసుకుందాం!..
మస్తిష్కానికి పట్టినబుజును..
దులిపేసుకుందాం!..
సహజమైన జీవనంలోకి అడుగేద్దాం
స్వచ్ఛమైన మనుషులాగా మారుదాం!..
చెడులన్నీ నివారించే విధంగా...
మనకు మనమే ప్రోత్సహించుకుందాం!..
లోపలి.అవయవాలకు పట్టిన...
స్వార్థపు కుళ్ళు రహస్యాలను
తొలిగించుకుందాం!..

మనతనువును చుసి ప్రకృతి పులకరించాలి!..
మన నడకనుచుసి
పశుపక్ష్యాదులు ఆనందపడాలి
లోపలి కుళ్లు కుతంత్రాలను..
స్వార్థపు సంకుచితాలను..
శుభ్రంగా కడిగేసుకుంటే మానసిక చైతన్యాన్ని...
అద్భుతంగా పొందవచ్చు!..
మనలో దార్శనీయస్థలాలు ఉన్నాయి
స్వచ్ఛమైన మనసుతో దర్శించుకొని ప్రేరేపిస్తే...
ఎన్నెన్నో నైపుణ్యాలు...
అందుబాటులోకి వస్తాయి!...

మనలో ప్రఖ్యాతి పొందిన..
వివిధ కళాత్మక నిర్మాణం దాగివుంది!..
మనసుతో చూడండి!..
అద్భుత రూపాలు కనబడుతాయి!..
కళాఖండాలు కదిలి వస్తాయి...
స్థిరమైన లక్ష్యాలకొరకు...
సుస్థిరమైన లాభాలకొరకు...
స్వచ్ఛమైన మనసుతో పనిచేయాలి!..
పైపైన తడిమిచూసే చూపులకు అందదు!..
చక్కని చిక్కని మనస్తత్వాన్నిబట్టి..
మనకు మనమే అంచనా వేసుకోవాలి!..
మనకు మనమే మారిపోవాలి!..
మనత్వాన్నివ్యక్తిత్వాన్ని మార్చుకోవాలి!..



అంబటి నారాయణ
నిర్మల్
9849326801

అల్పోర్స్ అనుమతులు నిలిపివేయాలి

■ ఇంటర్నేషనల్ స్కూల్ పేరుతో మరో సంస్థ

■ వెస్టన్ ఆస్ట్రేలియా కరికులం అమలుకు శ్రీకారం

■ ఫీజు దోపిడీకి అల్పోర్స్ ఇంకో కొత్త పథకం

■ రాజకీయాలను అడ్డుపెట్టి సంస్థ స్థాపన పనులు

■ అధికారులను భయపెట్టేందుకు "సుడా" ప్రయత్నాలు

బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కనపల్లి గణేష్

కరీంనగర్, జోర్దార్ ప్రతినిధి :అల్పోర్స్ ఇంటర్నేషనల్ స్కూల్ పేరుతో వెస్టన్ ఆస్ట్రేలియా కరికులంను అమలు చేసేందుకు కొత్తగా కరీంనగర్ లో ప్రారంభించనున్న పాఠశాల కోసం సదరు విద్యా సంస్థల యాజమాన్యం తెలంగాణ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖకు చేసిన దరఖాస్తులను తిరస్కరించి, అనుమతులను నిలిపివేయాలని బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ (బీఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు జక్కనపల్లి గణేష్ డిమాండ్ చేశారు. ఇప్పటికే అల్పోర్స్ విద్యాసంస్థల యాజమాన్యం విద్యాసంస్థలను కార్పొరేట్ స్థాయికి విస్తరించి, విచ్చలవిడిగా రాష్ట్ర వ్యాప్తంగా బ్రాంచ్‌లను స్థాపించి, విద్యను వ్యాపారంగా మలిచిందన్నారు. ఇంటర్నేషనల్ పేరుతో మరో పాఠశాలను స్థాపించి లక్షల రూపాయల ఫీజుల వసూలుకు శ్రీకారం చుట్టిందన్నారు. వెస్ట్ న్ ఆస్ట్రేలియా కరికులంను ఈ ప్రాంత విద్యార్థులకు అలవరచి, విదేశీ సంస్కృతికి శాశ్వత బానిసలను చేసే ప్రయత్నం చేస్తుందన్నారు. ప్రభుత్వాన్ని, రాజకీయాలను అడ్డుపెట్టుకొని అల్పోర్స్ విద్యా సంస్థల యాజమాన్యం తమ విద్యాసంస్థలను సమాజంలో కొరకరాని కొయ్యగా తయారు చేసిందన్నారు. ప్రభుత్వం అల్పోర్స్ విద్యాసంస్థల యజమానికి శాతవాహన అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ పదవి కట్టబెడితే, విద్యావ్యాపారంతో పాటు సూడా కార్యాలయం అవినీతి మయంగా మారుతుందన్నారు. అల్పోర్స్ ఇంటర్నేషనల్ స్కూల్ అనుమతులను నిలిపివేసి విద్యారంగాన్ని పరిరక్షించాలని, లేనిపక్షంలో తీవ్ర ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు.



బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కనపల్లి గణేష్

మోతుగూడెం అభివృద్ధికి
కూటమి అభ్యర్థులను గెలిపించాలి



ఏపీ స్టేట్ జోర్దార్ బ్యూరో, చింతూరు:మోతుగూడెంలో కూటమి నాయకులు జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థుల తరఫున ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కూటమి అభ్యర్థులను గెలిపిస్తే మోతుగూడెంను అరకు, మారేడుమిల్లి తరహాలో అభివృద్ధి చేస్తామని టీడీపీ మండల అధ్యక్షుడు జమాల్ ఖాన్, జడ్పీటీసీ అభ్యర్థి తీగల కవిత తెలిపారు. జడ్పీటీసీ అభ్యర్థిగా తీగల కవితను, ఎంపీటీసీ అభ్యర్థిగా విజయకుమారిని గెలిపించి కూటమి ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని ఓటర్లను కోరారు.
ఈ ప్రచారంలో టీడీపీ ప్రధాన కార్యదర్శి మల్లెల వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ వేగి చిన్న, జనసేన నాయకులు బేడే సతీష్, తీగల రవి, మల్లిపూడి సతీష్, పయ్యాల ప్రవీణ్, పోడియం నాగార్జున, కారం దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీ కార్యక్రమానికి బయలుదేరిన
కాంగ్రెస్ నాయకులు



■ కేంద్ర ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్

హసన్‌పర్తి,జోర్దార్ ప్రతినిధి:రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు చలో ఢిల్లీ కార్యక్రమానికి బయలుదేరారు.కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఈ కార్యక్రమంలో పాల్గొన నున్నారు.ఢిల్లీకి బయలుదేరిన వారిలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మన్నె బాబు రావు, హసన్‌పర్తి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రేణుకుంట్ల అశోక్,చౌటుపల్లి పీఏసీఎస్ చైర్మన్ అత్తి కుమారస్వామి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వీసం సురేందర్ రెడ్డి,తనుగుండ్ల జోగిరెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

■ రూ.40 వేల నగదు, బంగారం, వెండి పట్టీలు అగ్నికి ఆహుతి



మొగుళ్లపల్లి,జోర్దార్ ప్రతినిధి:మండలంలోని చింతల పల్లి గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో బుస్సా తిరుపతికి చెందిన ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఇంట్లోని వస్తువులతో పాటు రూ.40 వేల నగదు, అర్ధ తులం బంగారం, 10 తులాల వెండి పట్టీలు కాలిపోయాయి. దీంతో బాధిత కుటుంబం కట్టుబట్టలతో మిగిలింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఆర్ఐ శివరామకృష్ణ, లైన్‌మెన్ అనిల్ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వం స్పందించి ఆర్థిక సహాయం అందించి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని బాధితుడు తిరుపతి వేడుకున్నారు.

అంబేద్కర్ చిత్రపటం కప్పివేతపై కేసు నమోదు

(వీణవంక, జోర్దార్ ప్రతినిధి)వీణవంక మండలం మామిడాలపల్లి గ్రామంలో డా. బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటాన్ని వస్త్రంతో కప్పివేసి అవమానించారనే ఆరోపణలపై వీణవంక పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన అంబేద్కర్ యువజన సంఘం ప్రతినిధి దరిపెల్లి సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు చర్యలు చేపట్టారు.

బతుకమ్మ వేడుకల సమయంలో ఘటన?

ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. మామిడాలపల్లి గ్రామ బస్టాండ్ కూడలి వద్ద డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠాపన కోసం గతంలో శంకుస్థాపన చేసిన స్థలంలో ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో అక్టోబర్ 10న ఎంగిలిపూల బతుకమ్మ పండుగ సందర్భంగా కొందరు మహిళలు బతుకమ్మ ఆడుకునే సమయంలో అంబేద్కర్ చిత్రపటాన్ని వస్త్రంతో కప్పివేశారని ఫిర్యాదుదారు ఆరోపించారు.



ఈ విషయమై గ్రామ సర్పంచ్ ప్రశ్నించగా, సంబంధిత మహిళలు నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని, చిత్రపటాన్ని అక్కడి నుంచి తొలగించాలని పేర్కొన్నారని ఫిర్యాదులో వెల్లడించారు. ఈ ఘటనకు సంబంధించి ఆరుగురు మహిళల పేర్లను ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఏసీపీ

ఫిర్యాదు మేరకు వీణవంక పోలీసులు కేసు నమోదు చేసి ఎక్స్‌ప్రెస్ ఎఫ్ఐఆర్ జారీ చేశారు. కేసు దర్యాప్తు అధికారిణి హుజూరాబాద్ ఏసీపీ వి. మాధవి ఘటనా స్థలాన్ని పరిశీలించి సాక్షులను విచారించారు. ఘటనకు సంబంధించిన ఛాయా చిత్రాలు, వీడియోలు తదితర ఆధారాలను సేకరించారు.

దర్యాప్తులో వెల్లడయ్యే వాస్తవాల ఆధారంగా చట్టప్రకారం తదుపరి చర్యలు తీసు కుంటామని తెలిపారు.

పారదర్శకత, నిజాయితీతో కూడిన పాలనే లక్ష్యం

■ ఎన్‌టీపీసీ రామగుండం, తెలంగాణలో ఘనంగా ముగిసిన విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు

■ నిజాయితీ, జవాబుదారీతనానికి ఉద్యోగులు కట్టుబడి ఉండాలి -- ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫైజ్ తయ్యబ్

రామగుండం జోర్దార్ ప్రతినిధి:సంస్థాగత కార్యకలాపాల్లో పారదర్శకత, జవాబుదారీతనం, నిజాయితీ విలువలను పెంపొందించడమే లక్ష్యంగా ఎన్‌టీపీసీ రామగుండం, తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన 2026 విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ముగింపు వేడుకలను నిర్వహించి, వారమంతా చేపట్టిన అవగాహన కార్యక్రమాలను సమీక్షించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్‌టీపీసీ రామగుండం, తెలంగాణ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ప్రాజెక్టు హెడ్ ఫైజ్ తయ్యబ్ హాజరయ్యారు. తొలుత ఆయనకు ఘన స్వాగతం పలికిన అనంతరం ఎన్‌టీపీసీ గీతాలాపన, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైంది. తెలంగాణ విభాగం సీజీఎం (ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్) ముకుల్ రాయ్‌తో పాటు పలువురు జనరల్ మేనేజర్లు, వివిధ విభాగాల అధిపతులు, అదనపు జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు.

అవగాహన కార్యక్రమాలపై ప్రత్యేక ప్రదర్శన

విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ కార్యక్రమాలు, ప్రచార కార్యక్రమాలపై ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా లఘు చిత్రాలు, విజిలెన్స్ అవగాహన గీతాలు, ప్రచార వీడియోలు, ఇతర మాధ్యమాల ద్వారా చేపట్టిన కార్యక్రమాలను ప్రదర్శించారు. నైతిక విలువలు, పారదర్శకత, అవినీతి నిరోధక చర్యలపై ప్రజల్లో, ఉద్యోగుల్లో అవగాహన కల్పించడంలో సృజనాత్మక ప్రచార మాధ్యమాల పాత్రను వివరించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఫైజ్ తయ్యబ్ మాట్లాడుతూ సంస్థలోని ప్రతి స్థాయిలో నిజాయితీ, పారదర్శకత, జవాబుదారీతనాన్ని పాటించడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. ఉద్యోగులందరూ నైతిక విలువలకు కట్టుబడి విధులు నిర్వహించాలని, పరస్పర విశ్వాసం, సుపరిపాలనకు ప్రాధాన్యతనిచ్చే పని సంస్కృతిని నిర్మించడంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేసి అభినందించారు. అనంతరం కృతజ్ఞతలు తెలియజేసే కార్యక్రమం నిర్వహించి, జాతీయ గీతాలాపనతో వేడుకలను ముగించారు. 2026 విజిలెన్స్ అవగాహన వారోత్సవాల ద్వారా నిజాయితీ, నైతికత, పారదర్శకతతో కూడిన పని సంస్కృతిని మరింత బలోపేతం చేయడానికి ఎన్‌టీపీసీ రామగుండం, తెలంగాణ తన నిబద్ధతను మరోసారి చాటింది. “సమృద్ధి కోసం నిజాయితీ” (ప్రోబిటీ ఫర్ ప్రాస్పెరిటీ) అనే నినాదంతో సంస్థ ముందుకు సాగుతుందని స్పష్టం చేసింది.

మందమర్రిలో సింగరేణి ఆధ్వర్యంలో ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్, జయంతి వేడుకలు

బెల్లంపల్లి జోర్దార్ ప్రతినిధి:మందమర్రి ఏరియాలోని జనరల్ మేనేజర్ (జి.ఎమ్) కార్యాలయంలో శనివారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి (జాతీయ ఐక్యత దినోత్సవం) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ, ముఖ్య అతిథిగా హాజరై పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి వేడుకలను ప్రారంభించారు.

అనంతరం జి.ఎమ్ రాధాకృష్ణ మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యానంతరం 562 సంస్థానాలను భారత్ యూనియన్‌లో విలీనం చేసి దృఢమైన భారతదేశాన్ని నిర్మించిన మహా సమైక్యతా నిర్మాత సర్దార్ వల్లభాయ్ పటేలనీ, ఆయన ‘ఉక్కు మనిషి’గా దేశ చరిత్రలో చిరస్మరణీయులని కొనియాడారు.



దేశాన్ని ఏకం చేయడంలో సర్దార్ పటేల్ చూపిన కార్యదీక్ష, దేశభక్తి మనందరికీ ఎల్లప్పుడూ ఆదర్శప్రాయమని,భిన్నత్వంలో ఏకత్వాన్ని ప్రతిబింబించే మన భారతీయ సంస్కృతిని కాపాడుతూ, దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాలని,

క్లిష్ట సమయాల్లోను స్వార్థం లేకుండా దేశ ప్రయోజనాలకే ప్రథమ ప్రాధాన్యం ఇచ్చిన మహానీయుడు పటేలనీ అన్నారు.

ఉద్యోగులను, అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ, మనమందరము ఐక్యతతో మెలిగి,

రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తిని సాధించి మందమర్రి ఏరియాను సంస్థలోనే మొదటి స్థానంలో నిలపాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్ ఓ టు జి ఎం, జి ఎల్ ప్రసాద్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, డిపైపిఎం (పర్సనల్) సీనియర్ పిఓ సత్యనారాయణ, ఏఐటీయూసీ జిఎం స్ట్రక్చర్ సభ్యులు
సి వి. రమణ, ఉన్నత అధికారులు, వివిధ విభాగాల అధిపతులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు సీనియర్ సిటిజన్లకు ఘన సన్మానం

హుజూరాబాద్,జోర్దార్ ప్రతినిధి:హుజూరాబాద్ ప్రాంతానికి చెందిన 70 ఏళ్లు నిండిన సీనియర్ సిటిజన్లను గౌరవించేందుకు నవంబర్ 1న ఉదయం 10 గంటలకు వీఎల్ఆర్ కన్వెన్షన్‌లోని హుజూరాబాద్ క్లబ్ ఆవరణలో సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు 12వ వార్డు కౌన్సిలర్ వర్తినేని రవీందర్‌రావు తెలిపారు. ‘అనుభవాల సమ్మేళనం’ పేరుతో నిర్వహించే ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది వృద్ధులను సన్మానించనున్నట్లు పేర్కొన్నారు. మార్నింగ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు రవీందర్‌రావు, రాజపల్లి సర్పంచ్ మల్లారెడ్డి తెలిపారు.



ఇందిరాగాంధీ వర్ధంతి వేడుకలు నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు



కమలాపూర్,జోర్దార్ ప్రతినిధి:హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ బాబు ఆదేశాల మేరకు, డాక్టర్ మౌటం కుమారస్వామి ఆధ్వర్యంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు,కార్యకర్తలు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అనంతరం నాయకులు మాట్లాడుతూ దేశంలో బ్యాంకుల జాతీయీకరణతో పాటు అనేక విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చి పేదలు, దళితులు, మైనారిటీల సంక్షేమానికి ఇందిరాగాంధీ విశేష కృషి చేశారని కొనియాడారు. దేశానికి ఆమె చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఇందిరాగాంధీ ఆశయాలను కొనసాగిస్తూ, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతుందని తెలిపారు. ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో రాహుల్ గాంధీ పిలుపు మేరకు నిర్వహించనున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దేశిని ఐలయ్య,బాలసాని రమేష్ గౌడ్,పోడేటి భిక్షపతి, రామచందర్, మామిడాల అశోక్, ఎం.శ్రీనివాస్, రామా నాగరాజు,గుండారపు మధుకర్,బాలాపూర్ కనకరత్నం,తిప్పారావు యుగంధర్,భూతల లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



■ నల్ల బ్యాడ్జీలు ధరించి ఉపాధ్యాయుల నిరసన

వికారాబాద్,జోర్దార్ ప్రతినిధి:వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలంలోని ఆదర్శ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

సిద్ధాపురంలో విదేశీ విద్యార్థుల దాడి

■ యువకుడికి తీవ్ర గాయాలు

హసన్‌పర్తి,జోర్దార్ ప్రతినిధి:హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని సిద్ధాపురం గ్రామంలో ఎస్ఆర్ యూనివర్సిటీకి చెందిన ఆరుగురు విదేశీ విద్యార్థులు గ్రామస్థులపై దాడికి పాల్పడిన ఘటన కలకలం రేపింది.ఈ ఘటనలో ముస్కు రాజేష్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు.పోలీసుల వివరాల ప్రకారం.. శనివారం తెల్లవారు జామున దొమ్మరి వీధిలో మేకల సుమంత్‌పై విదేశీ విద్యార్థులు దాడి చేస్తుండగా, అడ్డుకునేందుకు వెళ్లిన గ్రామస్థులపై రాళ్లు, కర్రలతో దాడి చేశారు. ఈ క్రమంలో రాయి తగిలి రాజేష్ తలకు తీవ్ర గాయమైంది.

తొలుత ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స అందించి, అనంతరం మెరుగైన వైద్యం కోసం వేద ఆసుపత్రికి తరలించారు.

బాధితురాలు ముస్కు మాధవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ తెలిపారు.

వైద్య ఖర్చుల కోసం లక్ష రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



బెల్లంపల్లిలో ఘనంగా పోలీసులకు దాన శిబిరం

■ 150 యూనిట్ల రక్తాన్ని సేకరించిన పోలీసులు.

బెల్లంపల్లి జోర్దార్ ప్రతినిధి: పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా, స్థానిక ఏసీపీ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య భవన్ లో శనివారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా 150 మంది దాతలు ఇచ్చిన రక్తాన్ని సేకరించి జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ వారికి అందించారు.

ఈ సందర్భంగా ఏ సిపి కిరణ్ కుమార్ మాట్లాడుతూ, విషయాన్ని తెలుపగానే స్పందించి వన్టౌన్ సిఐ శ్రీనివాసరావు, రూరల్ సీఐ హనూక్, ఎస్ఐలు, రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేసినందుకు, అధికారులకు, సిబ్బందికి, రక్తదాతలందరికీ, స్వచ్ఛంద సేవ సంస్థల ప్రతినిధులకు, మున్సిపల్ కౌన్సిలర్లకు, ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రక్తదానం అనేది ఆపదలో, ప్రమాదాల్లో ఉన్నవారికి ఎంతో ఉపయోగపడుతుందని ప్రతి ఒక్కరూ రక్తాన్ని ఇచ్చేందుకు ముందుకు వచ్చి ఇతరుల ప్రాణాలను కాపాడాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లను అందించారు.



వికారాబాద్,జోర్దార్ ప్రతినిధి:వికారాబాద్ మండలం అంతగిరిపల్లికి చెందిన శివ నాగరాజుకు వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి మంజూరైన రూ.లక్ష చెక్కును తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు వైద్య ఖర్చుల భారం తగ్గించడంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతగానో ఉపయోగపడుతోందని తెలిపారు. ఆర్థిక సహాయం అందించిన ముఖ్యమంత్రి, శాసనసభాపతికి శివ నాగరాజు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ర్యాపిడోలో బంగారం పంపిస్తే.. ఆభరణాలతో ఉడాయించిన డ్రైవర్!

ర్యాపిడోలో బైక్ పార్సిల్ బుక్ చేసి బంగారు ఆభరణాలు పంపించాలనుకున్న ఓ వ్యక్తికి ఊహించని షాక్ తగిలింది. పార్సిల్‌ను గమ్యస్థానానికి చేర్చాల్సిన డెలివరీ డ్రైవర్.. అందులోని రూ.62,383 విలువైన బంగారు ఆభరణాలతోనే ఉడాయించాడు. దానికంటే ముందు పెట్రోల్ ఖర్చులకు డబ్బులు కావాలని అదనంగా రూ. 100 వసూలు చేసి మరీ వెళ్లాడు. కానీ ఎంత సమయమైనా పార్సిల్ అందకపోవడంతో కంగారుపడి ఫోన్ చేయగా.. బాధితుడి నంబర్‌ను బ్లాక్ చేశాడు. ఈ వింత ఘటన హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో వెలుగుచూసింది.

దత్త ప్రసాద్ నల్లపాటి అనే వ్యక్తి బంజారాహిల్స్ రోడ్ నంబర్ 2లోని వివో కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. నాగోల్‌లోని తన బంధువుల ఇంటికి బంగారు ఆభరణాలు పంపించాలని అనుకున్నాడు. రూ. 62,383 విలువైన బంగారపు ఉంగరాలు, గాజులను ఒక పార్సిల్‌లో ప్యాక్ చేశాడు. వాటిని పంపించేందుకు ర్యాపిడో పార్సిల్ సర్వీస్‌ను బుక్ చేశాడు. అనంతరం బంగారం ఉన్న పార్సిల్‌ను ర్యాపిడో డ్రైవర్‌కు ఇవ్వాలని సూచించాడు. ఇక కార్యాలయానికి వచ్చిన ర్యాపిడో డ్రైవర్ గీతిమెట్టు మురళికి సెక్యూరిటీ గార్డు పార్సిల్ అందజేశాడు. ఈ సందర్భంగా పార్సిల్‌ను తీసుకున్న ర్యాపిడో డ్రైవర్.. పెట్రోల్ ఖర్చుల కోసం అదనంగా రూ. 100 ఇవ్వాలని అడిగాడు. ఇదే విషయం సెక్యూరిటీ గార్డు చెప్పడంతో ర్యాపిడో డ్రైవర్‌కు దత్త ప్రసాద్ రూ.100 ఫోన్ పే చేశాడు. దీంతో ర్యాపిడో డ్రైవర్ పార్సిల్ తీసుకుని అక్కడి నుంచి బయల్దేరాడు. కాసేపటికి డ్రైవర్‌కు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. అనుమానం వచ్చి నాగోల్‌లోని బంధువులకు కాల్ చేయగా.. తమకు ఇంకా పార్సిల్ అందలేదని చెప్పారు. కంగారుగా మళ్లీ ర్యాపిడో డ్రైవర్‌కు కాల్ చేయగా.. దత్త ప్రసాద్ ఫోన్ నంబర్‌ను బ్లాక్ చేశాడు. మోసపోయానని గ్రహించిన దత్త ప్రసాద్ వెంటనే.. ర్యాపిడో కస్టమర్ కేర్‌ను సంప్రదించాడు. కానీ సమస్యకు పరిష్కారం లభించలేదు. దీంతో దత్తప్రసాద్ జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించాడు.

తెలంగాణ రాష్ట్రవ్యవసాయ శాఖలో కలకలం

- ఇన్‌చార్జ్ జిల్లా వ్యవసాయ అధికారిపై 55 మందిలో 44 మంది ఉద్యోగుల వాంగ్మూలాలు!
- వేధింపులు,అవినీతి, కులవివక్ష ఆరోపణలు.. 12 మంది ఇతర జిల్లాలకు బదిలీ

(ఆదిలాబాద్, జోర్దార్ ప్రతినిధి)ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వ్యవసాయ శాఖ ఉద్యోగులు ఇన్‌చార్జి జిల్లా వ్యవసాయ అధికారి అవినీతి, కార్యాలయ వేధింపులు, దురుసు ప్రవర్తనకు సంబంధించి పలు ఆరోపణలు చేసినట్లు సమాచారం.. ఆమె పనితీరుపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ ఫిర్యాదులు సమర్పించారు. ఈ ఆరోపణలను ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ సంచాలకులు, వ్యవసాయ ఉత్పత్తి కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం.
ఒక డివిజన్‌కు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలిగా (ఏడీఏ) పనిచేస్తున్న సదరు వ్యక్తికి అదనపు బాధ్యతలతో జిల్లా వ్యవసాయ అధికారిగా కొనసాగుతున్నారు. ఆమెపై వచ్చిన ఆరోపణలు ఇంకా స్వతంత్రంగా నిర్ధారణ కాలేదు.
విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల వ్యాపారుల నుంచి డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు ఉన్నాయని,జిల్లా ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్న ఇద్దరు మండల వ్యవసాయ అధికారుల (ఎంఏఓ) ద్వారా నేరుగా, అలాగే విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల వ్యాపారుల నుంచి ఆమె డబ్బులు వసూలు చేసినట్లు ఉద్యోగులు ఆరోపించారు.విత్తనాల వ్యాపారుల నుంచి కారును బహుమతిగా స్వీకరించారనే ఆరోపణ కూడా చేశారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపించాలని ఫిర్యాదులో కోరారు.

కిసాన్ మేళాలో రూ.6 లక్షల ఖర్చుపై ప్రశ్నలు

బెల్లంపల్లిలో నిర్వహించిన కిసాన్ మేళా కార్యక్రమంలోనూ అవకతవకలు జరిగాయని ఫిర్యాదులో పేర్కొన్నారు.
ఈ కార్యక్రమానికి సుమారు రూ.6 లక్షలు మంజూరు కాగా, దాదాపు రూ.3 లక్షలు మాత్రమే ఖర్చు చేసినట్లు ఆరోపించారు. మిగిలిన ఏర్పాట్లలో విత్తనాలు, ఎరువుల వ్యాపారులు సహకరించారని పేర్కొన్నారు.

100 నుంచి 150 వరకు మెమోలు జారీ చేశారనే ఆరోపణలు

బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి చిన్నపాటి తప్పిదాలకూ ఉద్యోగులకు 100 నుంచి 150 వరకు మెమోలు జారీ చేసినట్లు ఫిర్యాదుదారులు ఆరోపించారు. డిప్యూటేషన్లను కూడా ఉద్యోగులపై ఒత్తిడి తీసుకురావడానికి ఒక సాధనంగా ఉపయోగించారని పేర్కొన్నారు.
ఆమె పర్యటనల సమయంలో క్షేత్రస్థాయి అధికారులు భోజన ఏర్పాట్లు చేయాల్సి వచ్చేదని, అలా చేయని ఉద్యోగులు క్రమశిక్షణ చర్యలు, మెమోలను ఎదుర్కొన్నారని ఆరోపించారు.

రాత్రి వేళల్లోనూ గూగుల్ మీటింగ్‌లు

గూగుల్ మీట్ ద్వారా ఆన్‌లైన్ సమావేశాలను తరచూ నిర్వహించేవారని ఉద్యోగులు తెలిపారు. కొన్నిసార్లు రాత్రి వేళల్లో, సెలవు రోజుల్లో, పండుగ సమయాల్లో కూడా అకస్మాత్తుగా సమావేశాలు ఏర్పాటు చేసేవారని ఆరోపించారు.
ఈ సమావేశాలు రెండు నుంచి మూడు గంటలపాటు కొనసాగేవని పేర్కొన్నారు. ఆలస్యంగా సమావేశంలో చేరినవారిని, కుటుంబ అవసరాల కారణంగా సమావేశాల సమయంలో ఇబ్బందులు ఎదుర్కొన్నవారిని కూడా మందలించేవారని తెలిపారు.
మెమోలు జారీ చేస్తారనే భయం, డిప్యూటేషన్‌పై బదిలీ చేస్తారనే ఆందోళనతో ఉద్యోగులు తమ అభ్యంతరాలను వెల్లడించేందుకు వెనుకాడుతున్నారని ఫిర్యాదుదారులు పేర్కొన్నారు.

మహిళా ఉద్యోగుల పట్ల వేధింపుల ఆరోపణలు

మహిళా వ్యవసాయ అధికారులు (ఏఓలు), వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు) పట్ల వ్యవహరించిన తీరుపై ఫిర్యాదులో పలు ఆరోపణలు చేశారు.
మహిళా ఉద్యోగుల వ్యక్తిత్వాన్ని కించపరిచే వ్యాఖ్యలు చేయడంతోపాటు సమావేశాల్లో బహిరంగంగా అవమానించారని ఆరోపించారు.
శస్త్రచికిత్స అనంతరం కోలుకుంటున్న మహిళా ఉద్యోగులు, చిన్నపిల్లలకు పాలిచ్చే తల్లులు సైతం ఒక సమావేశంలో సుమారు మూడు గంటలపాటు నిలబడి ఉండాల్సి వచ్చిందని ఫిర్యాదులో పేర్కొన్నారు.
మహిళా ఉద్యోగులకు సంబంధించిన వైద్య బిల్లులను, ప్రసూతి సెలవుల సమయంలో చెల్లించాల్సిన ప్రయోజనాలను నిలిపివేశారని ఆరోపించారు. గర్భిణీ ఉద్యోగిని, చిన్నారికి పాలిచ్చే తల్లి కూడా వేధింపులకు గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.రైతు వేదికల వద్ద మరుగుదొడ్లు లేని విషయాన్ని ప్రశ్నించిన మహిళా ఉద్యోగినిని కూడా పురుష సహోద్యోగుల ముందు మందలించి అవమానించారని ఆరోపించారు.

మహిళా అధికారులకు దూర ప్రాంతాల్లో విధులు

జిల్లా ప్రధాన కార్యాలయానికి 8 నుంచి 10 గంటల ప్రయాణ దూరంలో ఉన్న ప్రాంతాల్లో సరిహద్దు తనిఖీ విధులను మహిళా ఎంఏఓలు, ఏఈఓలకు అప్పగించడంపై ఫిర్యాదులో అభ్యంతరాలు వ్యక్తం చేశారు.
పురుష సిబ్బంది అందుబాటులో ఉన్నప్పటికీ మహిళా ఉద్యోగులకు ఇలాంటి విధులు అప్పగించడాన్ని ప్రశ్నించారు.
జిల్లా ప్రధాన కార్యాలయానికి సుమారు 100 నుంచి 120 కిలోమీటర్ల దూరంలో ఉన్న క్లస్టర్‌కు ఒక మహిళా ఏఈఓను నియమించారని, దగ్గర ప్రాంతంలో పోస్టింగ్ ఇవ్వాలని కోరినా పట్టించుకోలేదని ఆరోపించారు.

కుల,మతపరమైన వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలు

కొంతమంది అధికారులపై మతం, కులం ప్రస్తావిస్తూ కించపరిచే వ్యాఖ్యలు చేశారని ఉద్యోగులు ఆరోపించారు. ఫిర్యాదులు చేసిన ఉద్యోగులపై ఒత్తిడి తీసుకురావడంతోపాటు వారికి మెమోలు జారీ చేసినట్లు పేర్కొన్నారు.
తమ సమస్యలను అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన ఉద్యోగులపై ప్రతీకార చర్యలకు పాల్పడారని ఫిర్యాదులో ఆరోపించారు. ఏఈఓల సంఘం నాయకుడు ఒక సహోద్యోగికి మద్దతుగా మాట్లాడినందుకు అతనిపై కూడా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

12 మంది ఇతర జిల్లాలకు బదిలీ

జిల్లాలో కుటుంబాలతో స్థిరపడిన ఉద్యోగులు, పాఠశాలలకు వెళ్లే పిల్లలు ఉన్నప్పటికీ బదిలీల సమయంలో 12 మంది ఉద్యోగులను ఇతర జిల్లాలకు పంపినట్లు ఫిర్యాదుదారులు పేర్కొన్నారు.
వారిలో సంఘం నాయకుడు కూడా ఉన్నట్లు తెలిపారు. మరికొందరు సెలవుపై వెళ్లారని, డిప్యూటేషన్‌పై వెళ్లారని, మరికొందరు జిల్లా విడిచి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారని పేర్కొన్నారు.

55 మందిలో 44 మంది వాంగ్మూలాలు

జిల్లా వ్యవసాయ శాఖలో నెలకొన్న పరిస్థితులపై జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అక్టోబర్ 24న జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి (డీఆర్డీఓ) ఆధ్వర్యంలో విచారణ ఏర్పాటు చేసినట్లు కథనంలో పేర్కొన్నారు.
ఈ విచారణకు హాజరైన 55 మంది వ్యవసాయ శాఖ ఉద్యోగుల్లో 44 మంది జిల్లా వ్యవసాయ అధికారికి వ్యతిరేకంగా వాంగ్మూలాలు ఇచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.
విచారణ జరిగిన రోజే సాయంత్రం వ్యవసాయ సహాయ సంచాలకులు (ఏడీఏలు), వ్యవసాయ అధికారులు (ఏఓలు)తో సమావేశం ఏర్పాటు చేసి, జిల్లా కార్యాలయ సూపరింటెండెంట్‌తో పాటు విచారణలో వాంగ్మూలాలు ఇచ్చిన ఉద్యోగులపై దుర్భాషలాడుతూ, కులపరమైన వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు.
తాను ఎస్సీ మహిళననే విషయాన్ని ప్రస్తావిస్తూ అధికారాన్ని చాటుకున్నారని ఉద్యోగులు ఆరోపించినట్లు కథనంలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి సంబంధించిన ఆడియో రికార్డింగ్ తమ వద్ద ఉందని సిబ్బంది చెబుతున్నప్పటికీ, అందులోని విషయాలు స్వతంత్రంగా నిర్ధారణ కాలేదని కథనం స్పష్టం చేసింది.

ఫిర్యాదులు వెనక్కి తీసుకోవాలని ఒత్తిడి?

జిల్లా వ్యవసాయ అధికారికి సన్నిహితంగా ఉన్నట్లు భావిస్తున్న కొందరు అధికారులు ఉద్యోగులపై ఒత్తిడి తెచ్చి, విచారణలో ఇచ్చిన వాంగ్మూలాలను వెనక్కి తీసుకోవాలని కోరుతున్నట్లు ఫిర్యాదుదారులు ఆరోపించారు.

వ్యవసాయ శాఖలో ప్రస్తుతం నెలకొన్న పని వాతావరణంపై ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇన్ని ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఇన్‌చార్జి జిల్లా వ్యవసాయ అధికారి కొనసాగింపుపైనా ప్రశ్నలు లేవనెత్తుతున్నారు.

ఈ వ్యవహారంపై సమగ్రంగా, నిష్పక్షపాతంగా విచారణ జరిపించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ఉద్యోగులు కోరుతున్నారు. టి ఆర్ డి ఏ పి డి కిషన్ గారు విచారణ చేసింది వేదిక కలెక్టర్ అందినది స్టేట్ వ్యవసాయ శాఖ కమిషనర్ గోపి గారు వెంటనే స్పందించి ఆ జిల్లా ఉద్యోగులకు వెలుగు జీవితాలు ప్రసాదించాలని ఆ జిల్లా ఉద్యోగులు కోరుతున్నారు.
కాగా వాస్తవాలు వెలుగులోకి చేస్తున్న పత్రికా విలేక రులను కూడా కేసు పెడతానంటూ బెదిరిస్తున్నా రని తెలిసింది సీఎం రేవంత్ రెడ్డి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెంటనే స్పందించి ఆ జిల్లాలోని ప్రత్యేక పరిస్థితులపై తగిన చర్య తీసుకోవాలని సమస్యను వెంటనే ముగించాలని రైతు సంఘాలు ఉద్యోగుల సంఘాలు కోరుతున్నాయి

ఫార్మసిస్టుల సర్టిఫికెట్లు కావాలి.. ఫార్మసిస్టులు మాత్రం వద్దా?

- నిజామాబాద్ ఖలీల్వాడీ ఆస్పత్రుల్లో ఫార్మసిస్టులు లేకుండానే ఫార్మసీల నిర్వహణ?
- 80 శాతం ఆస్పత్రుల్లో ఫార్మసిస్టులు లేరనే ఆరోపణలు.. కిరాయి సర్టిఫికెట్ల వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలి!

(నిజామాబాద్: జోర్దార్ ప్రతినిధి) ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన ఆస్పత్రుల్లోనే ఔషధాల భద్రత ప్రశ్నార్థకంగా మారుతోందా? నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఖలీల్వాడీ ప్రాంతంలో పలు ప్రైవేట్ ఆస్పత్రుల ఫార్మసీలు రిజిస్టర్డ్ ఫార్మసిస్టుల ప్రత్యక్ష పర్యవేక్షణ లేకుండానే కొనసాగుతున్నాయనే ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారుతున్నాయి. సుమారు 80 శాతం వరకు ఆస్పత్రుల్లో ఫార్మసిస్టులు అందుబాటులో లేరనే ఆరోపణలపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని ఫార్మసిస్టులు డిమాండ్ చేస్తున్నారు.

ఫార్మసిస్టులు ఉన్నారు.. ఉద్యోగాలు మాత్రం ఇవ్వరు!

నిజామాబాద్ జిల్లాలో ఫార్మసీ విద్యను పూర్తిచేసిన అనేకమంది అర్హత కలిగిన ఫార్మసిస్టులు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారు. మరోవైపు ఆస్పత్రుల్లో ఫార్మసీ విభాగాలు కొనసాగుతున్నప్పటికీ అర్హులైన ఫార్మసిస్టులను నియమించకుండా వారి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను మాత్రమే వినియోగించుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఫార్మసిస్టులకు ఉద్యోగాలు కల్పించకుండా కేవలం సర్టిఫికెట్లు తీసుకోవడం వెనుక ఉన్న వ్యవహారాలపై డ్రగ్ కంట్రోల్ అధికారులు దృష్టి సారించాలి.
ఫార్మసీ కౌన్సిల్ జారీ చేసే రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ అలంకారప్రాయంగా ఉంచుకోవడానికి కాదు. ప్రజలకు సురక్షితమైన ఔషధ సేవలు అందించడానికి, చట్టబద్ధంగా ఫార్మసీ వృత్తిని నిర్వహించడానికి ఇచ్చే గుర్తింపు. అలాంటప్పుడు ఫార్మసిస్టులను పక్కనపెట్టి వారి సర్టిఫికెట్లతో మాత్రమే ఫార్మసీలు నిర్వహించడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఫార్మసిస్ట్ లేకుండా మందుల పంపిణీ ఎలా?

ఔషధాల సరైన పంపిణీ (Dispensing), మోతాదుల పరిశీలన, మందుల వినియోగంపై రోగులకు కౌన్సెలింగ్, ఔషధాల నిల్వ, గడువు తేదీల పరిశీలన వంటి అంశాల్లో ఫార్మసిస్టుల పాత్ర ఎంతో కీలకం. ఫార్మసిస్ట్ ప్రత్యక్ష పర్యవేక్షణ లేకుండా మందుల పంపిణీ జరిగితే తప్పు మోతాదులు, ఔషధాల పరస్పర చర్యలు, గడువు ముగిసిన మందులు, నాణ్యత లేని లేదా నకిలీ ఔషధాలను గుర్తించడంలో వైఫల్యాలు తలెత్తే ప్రమాదం ఉంది.
ఆస్పత్రుల పనివేళలకు అనుగుణంగా ప్రతి షిఫ్టులో అర్హత కలిగిన రిజిస్టర్డ్ ఫార్మసిస్ట్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. 24 గంటల ఆస్పత్రుల్లో నిరంతర ఫార్మసిస్ట్ సేవలు అందించడానికి తగిన సంఖ్యలో ఫార్మసిస్టులను నియమించాలి.

ఫార్మసిస్టుల హక్కుల కోసం కొనసాగుతున్న పోరాటం

ఫార్మసిస్టుల ఉపాధి హక్కులు, వృత్తి గౌరవం, ప్రజారోగ్య పరిరక్షణ కోసం ఫార్మసిస్టుల సంఘాలు వివిధ స్థాయిల్లో పోరాటాలు కొనసాగిస్తున్నాయి. ఆస్పత్రి ఫార్మసీల్లో రిజిస్టర్డ్ ఫార్మసిస్టుల నియామకాలు చేపట్టాలని, సర్టిఫికెట్ల దుర్వినియోగాన్ని అరికట్టాలని, అక్రమంగా నడుస్తున్న ఫార్మసీలపై చర్యలు తీసుకోవాలని అధికారులకు వినతులు, ఫిర్యాదులు సమర్పించడం, RTI ద్వారా సమాచారం సేకరించడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. ముఖ్యంగా కామారెడ్డి ఫార్మసిస్టుల సంక్షేమ సంఘం నిరంతర కృషి, పోరాటాల ఫలితంగా ఆస్పత్రి ఫార్మసీల్లో సుమారు 23 మంది ఫార్మసిస్టులకు ఉద్యోగ అవకాశాలు కల్పించి నియమించడంలో కీలక పురోగతి సాధించింది. ఫార్మసిస్టుల ఉపాధి హక్కుల కోసం సంఘం చేసిన కృషికి ఇది ఒక ముఖ్యమైన విజయంగా నిలిచింది. ఇదే తరహాలో నిజామాబాద్ జిల్లాలోనూ ఆస్పత్రి ఫార్మసీలపై సమగ్ర తనిఖీలు చేపట్టి అర్హులైన ఫార్మసిస్టులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

డాక్టర్లు -- ఫార్మసిస్టుల మధ్య సమన్వయం అవసరం

ఫార్మసిస్టులు ఆస్పత్రుల్లో పనిచేయాలని కోరితే వివాదాలు, బెదిరింపులు, కేసుల వరకు వెళ్లే పరిస్థితులు ఏర్పడటం ఆందోళనకరం. ఫార్మసిస్టులు డాక్టర్లకు ప్రత్యర్థులు కాదు. రోగికి సరైన వైద్య సేవలు అందించడంలో వైద్యులతో పాటు ఫార్మసిస్టుల పాత్ర కూడా ముఖ్యమైనది. వైద్యులు, ఫార్మసిస్టులు పరస్పర గౌరవంతో పనిచేసే వాతావరణాన్ని అధికారులు కల్పించాలి.

అధికారులు వెంటనే స్పందించాలి

నిజామాబాద్ ఖలీల్వాడీ ప్రాంతంలోని ఆస్పత్రుల ఫార్మసీలపై డ్రగ్ కంట్రోల్ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలి. రిజిస్టర్డ్ ఫార్మసిస్టుల నియామకాలు, వారి విధుల సమయాలు, హాజరు రికార్డులు, సర్టిఫికెట్ల వినియోగం, ఔషధాల కొనుగోలు, విక్రయాల రికార్డులను పరిశీలించాలి. ఫార్మసిస్టుల ప్రత్యక్ష సేవలు లేకుండా ఫార్మసీలు నిర్వహిస్తున్నట్లు నిర్ధారణ అయితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి.
అదేవిధంగా DMHO అధికారులు క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం పరిధిలో ఆస్పత్రుల నిర్వహణ నిబంధనలను పరిశీలించాలి. IMA, డాక్టర్స్ అసోసియేషన్, ఫార్మసిస్ట్ అసోసియేషన్లతో సంయుక్త సమావేశం నిర్వహించి ఫార్మసీ చట్టాలు, ఔషధ భద్రతపై అవగాహన కల్పించాలి. డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం 1940, ఫార్మసీ చట్టం 1948, వినియోగదారుల రక్షణ చట్టం ప్రకారం సంబంధిత నిబంధనలను అమలు చేయాలి.

చట్టాలు ఉన్నా అమలు చేయకపోతే ప్రయోజనం ఏమిటి?

ఫార్మసిస్టుల సర్టిఫికెట్లు తీసుకోవడానికి ఆసక్తి చూపుతున్న ఆస్పత్రులు, అదే ఫార్మసిస్టులకు ఉద్యోగాలు కల్పించడానికి ఎందుకు ముందుకు రావడం లేదు? ఫార్మసీ విద్యను అభ్యసించి రిజిస్ట్రేషన్ పొందిన యువత తమ వృత్తిని ఎందుకు కొనసాగించలేకపోతున్నారు? ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం రూపొందించిన చట్టాలు అమలుకు నోచుకోకపోతే వాటి ప్రయోజనం ఏమిటి?
నిజామాబాద్ ఖలీల్వాడీ ఆస్పత్రుల ఫార్మసీల వ్యవహారంపై ఉన్న ఆరోపణలకు అధికారులు సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది. ఫార్మసిస్టులకు న్యాయం జరగాలి.. ప్రజలకు సురక్షితమైన ఔషధ సేవలు అందాలి.. అక్రమాలకు అడ్డుకట్ట పడాలి అనేది ఫార్మసిస్టుల ప్రధాన డిమాండ్.

గుప్పుమంటున్న గుడుంబా దందా!

- గ్రామగ్రామాన ప్యాకెట్లలో అక్రమ విక్రయాలు
- ప్రజారోగ్యానికి ముప్పు.. పట్టించుకోని ఎక్సైజ్ శాఖ?

(మొగుళ్లపల్లి,జోర్దార్ ప్రతినిధి) మొగుళ్లపల్లి మండలంలో గుడుంబా అక్రమ విక్రయాలు మళ్లీ జోరందుకున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో గుడుంబా తయారీ కేంద్రాలు వెలుస్తున్నాయని, అక్కడ తయారవుతున్న గుడుంబాను ప్యాకెట్ల రూపంలో వివిధ గ్రామాలకు సరఫరా చేస్తూ అక్రమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రాణాంతకమైన ముడి పదార్థాలతో తయారవుతున్న కల్తీ గుడుంబా ప్రజల ఆరోగ్యానికి తీవ్ర ముప్పుగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇళ్లకే చేరుతున్న ముడి సరుకులు

గుడుంబా తయారీకి అవసరమైన ముడి సరుకులను కొందరు వ్యాపారులు ఇళ్లకు తరలిస్తూ రహస్యంగా తయారీ, విక్రయాలు సాగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్యాకెట్ల రూపంలో గ్రామాలకు సరఫరా చేస్తుండటంతో ఈ అక్రమ దందాను గుర్తించడం కష్టంగా మారుతోందని స్థానికులు చెబుతున్నారు. గుడుంబా సేవించడం వల్ల ప్రజలు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల దాడులు ఏవీ?

గతంలో గుడుంబా తయారీపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించి, ఈ అక్రమ వ్యాపారాన్ని నియంత్రించేందుకు అధికారులు చర్యలు చేపట్టిన విషయాన్ని ప్రజలు గుర్తుచేస్తున్నారు. అయితే ప్రస్తుతం మళ్లీ గుడుంబా విక్రయాలు పెరుగుతున్నాయనే ఆరోపణలు వస్తున్నా సంబంధిత ఎక్సైజ్ అధికారులు తగిన స్థాయిలో స్పందించడం లేదని విమర్శిస్తున్నారు.
ఇప్పటికైనా ఎక్సైజ్ శాఖ అధికారులు మండలంలోని గ్రామాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, అక్రమ తయారీ కేంద్రాలను గుర్తించాలని, నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని గుడుంబా దందాకు అడ్డుకట్ట వేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పోలియో గురించి తల్లిదండ్రులు తెలుసుకోవాల్సిన ముఖ్యమైన విషయాలు ఇవే



ప్రతి ఏడాది అక్టోబర్ నెలలో ప్రపంచ పోలియో దినోత్సవాన్ని నిర్వహిస్తారు. పోలియో వ్యాధి నిర్మూలనలో టీకాల ప్రాధాన్యంపై ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశం. ఈ ఏడాది ఇతివృత్తం ఒక రోజు.. ఒకే లక్ష్యం..
పోలియో నిర్మూలన. పోలియో వైరస్ సోకడం వల్ల పిల్లల్లో శాశ్వత పక్షవాతం ఏర్పడటంతోపాటు, తీవ్రమైన సందర్భాల్లో ప్రాణాలు కూడా కోల్పోయే ప్రమాదం ఉంటుంది. ఈ వ్యాధికి ప్రత్యేక చికిత్స లేదు. టీకాలు వేయించుకోవడం ద్వారానే పిల్లలను పోలియో నుంచి రక్షించుకోవచ్చు. భారత్‌లో 2011 నుంచి సహజ పోలియో వైరస్ కేసులు నమోదు కాలేదు. అయినప్పటికీ ప్రపంచంలోని కొన్ని ప్రాంతాల్లో వైరస్ ఇంకా వ్యాప్తిలో ఉండడంతో, పిల్లలకు టీకాలు వేయించడం కొనసాగించడం అత్యంత అవసరం.

రెండు రకాలుగా టీకా..

పోలియో నివారణకు ఇంజెక్షన్ ద్వారా ఇచ్చే ఐపీవీ, నోటిద్వారా చుక్కల రూపంలో ఇచ్చే ఓపీవీ టీకాలు ఉపయోగిస్తారు. ఐపీవీ శరీరంలో ప్రతిరక్షకాలను అభివృద్ధి చేసి, పోలియో వల్ల వచ్చే పక్షవాతం నుంచి రక్షణ కల్పిస్తుంది. ఓపీవీ పేగుల్లో రోగనిరోధక శక్తిని పెంచి, వైరస్ వ్యాప్తిని తగ్గించడంలో సహాయపడుతుంది. ఈ రెండు టీకాలు వేర్వేరు విధాలుగా రక్షణ కల్పిస్తాయి. అందువల్ల ఒక టీకా వేయించుకున్నంత మాత్రాన మరొకటి అవసరం లేదని భావించకూడదు. జాతీయ టీకాల కార్యక్రమం ప్రకారం పిల్లలకు రెండింటినీ వేయించాలి.
పల్స్ పోలియో కార్యక్రమాల సమయంలో కూడా అర్హులైన పిల్లలకు అదనపు ఓపీవీ చుక్కలు వేయించాలి.

ఏయే వయస్సులో వేయించాలి..

భారత జాతీయ టీకాల కార్యక్రమం ప్రకారం పుట్టిన వెంటనే, ఆరు, పది, పద్నాలుగు వారాల వయసులో ఓపీవీ చుక్కలు ఇస్తారు. అలాగే 16 నుంచి 24 నెలల మధ్య బూస్టర్ డోసు వేస్తారు. ఐపీవీ టీకాను ఆరు, పద్నాలుగు వారాల సమయంలో నిర్ణీత పద్ధతిలో ఇస్తారు. తల్లిదండ్రులు పిల్లల టీకాల వివరాలను భద్రపరచుకోవాలి. ఏదైనా డోసు మిస్ అయితే వైద్యులను సంప్రదించి తదుపరి చర్యలు తీసుకోవాలి. టీకాలు వేసినప్పటికీ వంద శాతం రక్షణ ఉంటుందని చెప్పలేం. అయితే సూచించిన అన్ని డోసులు పూర్తిచేయడం వల్ల పోలియో పక్షవాతం నుంచి బలమైన రక్షణ లభిస్తుంది.
టీకాల మధ్య విరామాలు ఏర్పడడం, సమాజంలో తక్కువ మంది మాత్రమే టీకాలు వేయించుకోవడం వల్ల పిల్లలకు ముప్పు పెరిగే అవకాశం ఉంటుంది.

సమాజ రోగనిరోధక శక్తి బలోపేతం..

పల్స్ పోలియో కార్యక్రమాల్లో అదనంగా ఇచ్చే చుక్కలు కూడా సురక్షితమైనవే. ఇప్పటికే సాధారణ టీకాలు పూర్తిచేసుకున్న పిల్లలకు కూడా ప్రచార సమయంలో అదనపు డోసులు ఇవ్వడం వల్ల సమాజంలో రోగనిరోధక శక్తి మరింత బలపడుతుంది.
ఒక ప్రాంతంలో ఎక్కువ మంది టీకాలు వేయించుకున్నప్పుడు వైరస్ వ్యాప్తికి అవకాశం తగ్గుతుంది.
దీనివల్ల అప్పుడే పుట్టిన శిశువులు, వైద్య కారణాలతో టీకాలు తీసుకోలేని వారికి కూడా పరోక్ష రక్షణ లభిస్తుంది. పోలియో సోకిన తర్వాత పక్షవాతం ఏర్పడితే దానికి చికిత్స లేదు కాబట్టి, వ్యాధి రాకుండా ముందుగానే టీకాలు వేయించుకోవడమే అత్యంత ప్రభావవంతమైన మార్గం. పిల్లల టీకాల విషయంలో నిర్లక్ష్యం చేయకుండా, నిర్ణీత షెడ్యూల్‌ను తప్పనిసరిగా పాటించాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు

పారదర్శకత,నిజాయితీతోనే సంస్థ అభివృద్ధి

- ఎన్టీపీసీ రామగుండం, తెలంగాణలో ముగిసిన విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్--2026
- ఉద్యోగులకు నైతిక విలువలపై ప్రాజెక్టు హెడ్ ఫైజ్ తయ్యబ్ సందేశం

(రామగుండం,జోర్దార్ ప్రతినిధి)పారదర్శకత, జవాబుదారీతనం, నిజాయితీతో కూడిన పని సంస్కృతిని పెంపొందించడమే లక్ష్యంగా ఎన్టీపీసీ రామగుండం, తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్--2026 ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి. వృత్తిపరమైన, ప్రజా జీవితంలో నైతిక విలువల ప్రాధాన్యతను చాటిచెప్పేలా వారం రోజులపాటు పలు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్టీపీసీ రామగుండం, తెలంగాణ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, హెడ్ ఆఫ్ ప్రాజెక్ట్ ఫైజ్ తయ్యబ్ హాజరయ్యారు. తొలుత అతిథులకు స్వాగతం పలికిన అనంతరం ఎన్టీపీసీ గీతాలాపన, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైంది. తెలంగాణ విభాగం సీఏజీఎం ముకుల్ రాయ్‌తో పాటు పలువురు జనరల్ మేనేజర్లు, వివిధ విభాగాల అధిపతులు, అదనపు జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు.విజిలెన్స్ అవేర్‌నెస్ క్యాంపెయిన్--2026లో భాగంగా నిర్వహించిన కార్యక్రమాలు, చేపట్టిన అవగాహన చర్యలపై ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేశారు. చిన్న చిత్రాలు, విజిలెన్స్ అవగాహన గీతాలు, ప్రచార వీడియోలు, ఇతర సమాచార మాధ్యమాల ద్వారా నిజాయితీ, నైతిక విలువలపై ప్రజల్లో, ఉద్యోగుల్లో చైతన్యం కల్పించిన తీరును వివరించారు.
ఈ సందర్భంగా ఫైజ్ తయ్యబ్ మాట్లాడుతూ సంస్థలోని ప్రతి స్థాయిలో పారదర్శకత, జవాబుదారీతనం, నిజాయితీ పాటించాలని ఉద్యోగులకు సూచించారు. నైతిక ప్రవర్తనకు ప్రాధాన్యతనిస్తూ విశ్వాసం, సుపరిపాలనతో కూడిన పని వాతావరణాన్ని నిర్మించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.
అనంతరం విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు. కృతజ్ఞతలు తెలిపే కార్యక్రమం అనంతరం జాతీయ గీతాలాపనతో వేడుకలు ముగిశాయి.

సంపదకు సమగ్రతే పునాది

నిజాయితీ, పారదర్శకత, జవాబుదారీతనం అనే విలువలతో కూడిన సంస్థాగత సంస్కృతిని మరింత బలోపేతం చేస్తామని ఎన్టీపీసీ రామగుండం, తెలంగాణ యాజమాన్యం ఈ సందర్భంగా పునరుద్ఘాటించింది. 'సంపదకు నిజాయితీ పునాది' అనే నినాదంతో నైతిక విలువల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తామని స్పష్టం చేసింది.

జోర్దార్ వార్తకు స్పందన హైదరాబాద్ జిల్లా పాఠశాలల

నిధుల ఖర్చులపై అధికారుల ఆరా!

- బిల్లులు, కొనుగోళ్లు, నగదు పుస్తకాల వివరాలు సిద్ధం చేయాలని ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు
- కథనంతో కదిలిన విద్యాశాఖ.. రికార్డుల పరిశీలనకు సిద్ధం

(హైదరాబాద్ జోర్దార్ ప్రతినిధి): ఇటీవల జోర్దార్ తెలుగు దిన పత్రికలో వచ్చిన వార్త హైదరాబాద్ జిల్లాలో సంచలనం సృష్టించింది బండ్లగూడ జోన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో నిధుల వినియోగం, కొనుగోళ్లు, తప్పుడు బిల్లులకు సంబంధించిన ఆరోపణలపై ప్రచురితమైన వార్తతో విద్యాశాఖ అధికారులు స్పందించారు. ఈ నేపథ్యంలో ఉప విద్యాశాఖాధికారి కార్యాలయం నుంచి జోన్ పరిధిలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు కీలక ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.
పత్రికలో పాఠశాలల్లో నిధుల ఖర్చులు, కొనుగోళ్లలో అవకతవకలు, తప్పుడు బిల్లులపై వచ్చిన కథనం నేపథ్యంలో సంబంధిత రికార్డులను సిద్ధం చేసుకోవాలని అధికారులు సూచించారు.

11 అంశాలపై వివరాలు సేకరణ

ప్రతి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంబంధిత ఆర్థిక సంవత్సరాల రికార్డుల ఆధారంగా పాఠశాల పేరు, చిరునామా, యూడైస్ ప్లస్ కోడ్‌తో పాటు పాఠశాలకు మంజూరైన అన్ని రకాల నిధులు, గ్రాంట్లు, వాటి ఖర్చుల వివరాలను సిద్ధం చేయాలి. ఖర్చులకు సంబంధించిన బిల్లులు, వోచర్లు, ఇన్వాయిస్‌లు, నగదు పుస్తకాలు అందుబాటులో ఉంచుకోవాలి.
అదేవిధంగా కొనుగోలు చేసిన వస్తువుల వివరాలు, వాటి పరిమాణం, ధర, సరఫరాదారుల సమాచారం, కొనుగోలు ఉత్తర్వులు, కోటేషన్లు, కమిటీ తీర్మానాలు, నిల్వ రిజిస్టర్లు, వస్తువుల స్వీకరణ, వినియోగ వివరాలను సిద్ధం చేయాలని సూచించారు.

బిల్లులు.. చెల్లింపులపై ప్రత్యేక దృష్టి

బిల్లులను ధ్రువీకరించిన అధికారులు, చెల్లింపులకు అనుమతించిన వారి వివరాలతో పాటు సరఫరాదారులకు చేసిన చెల్లింపుల వివరాలను కూడా సిద్ధం చేయాలి. బిల్లులు, చెల్లింపులు, నిల్వ రిజిస్టర్లలో ఏవైనా వ్యత్యాసాలు ఉంటే వాటిని స్పష్టంగా తెలియజేయాలి. గతంలో నిర్వహించిన తనిఖీలు, ఆడిట్ అభ్యంతరాలు, విచారణలు, వాటిపై తీసుకున్న చర్యలకు సంబంధించిన రికార్డులను సైతం అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించినట్లు సమాచారం.

వాస్తవ రికార్డులే ప్రామాణికం

పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలని, ఎలాంటి తప్పుడు సమాచారం లేకుండా అసలు రికార్డుల ఆధారంగానే వివరాలను సిద్ధం చేసుకోవాలని అధికారులు సూచించారు. ఈ పరిణామంతో బండ్లగూడ జోన్ పరిధిలోని పాఠశాలల్లో నిధుల వినియోగం, కొనుగోళ్ల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది.
నిధుల వినియోగంపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో రికార్డుల పరిశీలనకు అధికార యంత్రాంగం సిద్ధమవుతున్న తీరు ప్రాధాన్యత సంతరించుకుంది.
కాగా బండ్లగూడ మండలంలో బిల్లులను వినియోగించడంలో ఎలాంటి తప్పులు చేయలేదని మండల విద్యాధికారి విశ్వనాథం గుప్తా జోర్దార్ ప్రతినిధికి వివరణ ఇచ్చారు నిధుల వినియోగంలో తప్పు జరిగిందా జరగలేదని విచారణ జరగకముందే బండ్లగూడ మండలంలో విద్యాశాఖలో ఉద్యోగులు భయంతో జీవితం గడుపుతున్నారని సమాచారం

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం

రుద్రవనం వెబ్ సిరీస్ రివ్యూ?



తెలుగులో ఒరిజినల్ వెబ్ సిరీస్‌ల జోరు ఇప్పుడు బాగా పెరిగింది. అదే కోవలో వచ్చిన మరో క్రైమ్ థ్రిల్లర్ రుద్రవనం.్లూ. నరేష్ అగస్త్య నటించిన ఈ సిరీస్ జీ5లో స్ట్రీమింగ్ అవుతుంది. మరి ఈ సిరీస్ ఎలా ఉంది.. మెప్పించిందా లేదా అనేది పూర్తి రివ్యూలో చూద్దాం.. రుద్రవనం అనే ఒక మారుమూల ఊరిలో ఉన్న పోలీసుల కేంద్రం చుట్టూ ఈ కథ నడుస్తుంది. అక్కడ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసే పోలీస్ అధికారి (నరేష్ అగస్త్య), తన పై అధికారితో (బెనర్జీ) కలిసి విధుల్లో ఉంటాడు.తెలుగులో ఒరిజినల్ వెబ్ సిరీస్‌ల జోరు ఇప్పుడు బాగా పెరిగింది. అదే కోవలో వచ్చిన మరో క్రైమ్ థ్రిల్లర్ రుద్రవనం.్లూ. నరేష్ అగస్త్య నటించిన ఈ సిరీస్ జీ5లో స్ట్రీమింగ్ అవుతుంది. మరి ఈ సిరీస్ ఎలా ఉంది.. మెప్పించిందా లేదా అనేది పూర్తి రివ్యూలో చూద్దాం..కథరుద్రవనం అనే ఒక మారుమూల ఊరిలో ఉన్న పోలీసుల కేంద్రం చుట్టూ ఈ కథ నడుస్తుంది. అక్కడ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసే పోలీస్ అధికారి (నరేష్ అగస్త్య), తన పై అధికారితో (బెనర్జీ) కలిసి విధుల్లో ఉంటాడు. తను సెలవు మీద వెళ్లాలి అనుకునే ముందు రోజు ఊహించని విధంగా ఒక గుర్తుతెలియని శవం దొరుకుతుంది. దానికి తోడు స్థానిక రాజకీయ నాయకుడి (రాజా రవీంద్ర) సోదరుడు కనిపించకుండా పోతాడు. ఈ రెండు వ్యవహారాలు పోలీసులకు పెద్ద సవాలుగా మారుతాయి. ఇంతలో దొరికిన ఆ శవం మొండెం నుంచి తలకాయ అదృశ్యం అవుతుంది. అసలు ఆ శవం ఎవరిది? నాయకుడి తమ్ముడు ఏమయ్యాడు? ఈ చిక్కుముడులను ఆ అధికారి ఎలా విప్పాడు? అన్నదే ఈ సిస్ సారాంశం.

కథనం:క్రైమ్ థ్రిల్లర్ కాన్సెప్ట్‌తో సాగే వెబ్ సిరీస్‌లను తెరకెక్కించేటప్పుడు ప్రేక్షకుడికి ఎక్కడా విసుగు రాకుండా చూసుకోవడం చాలా ముఖ్యం. ఈ విషయంలో దర్శకుడు చాలా తెలివిగా వ్యవహరించాడు. సుదీర్ఘమైన ఎపిసోడ్స్ పెట్టి సాగదీయకుండా, చాలా తక్కువ నిడివితో విషయాన్ని సూటిగా చెప్పే ప్రయత్నం చేయడం ఈ ప్రాజెక్టుకు అతిపెద్ద బలం. మొత్తం 7 భాగాలుగా రూపొందిన ఈ సిరీస్‌లో, ప్రారంభం నుంచి 5వ భాగం వరకు చాలా ఉత్కంఠభరితంగా సాగుతుంది. నేర విచారణ తీరు, మధ్యలో వచ్చే ఊహించని మలుపులు చూసేవారిని కట్టిపడేస్తాయి. ప్రారంభంలో వచ్చే కుటుంబ అనుబంధాల సన్నివేశాలు కూడా చాలా సహజంగా అనిపిస్తాయి. కానీ విచారణ ఎంత ఆసక్తికరంగా సాగిందో, ముగింపు కూడా అంతే బలంగా ఉండాలి. అక్కడే ఈ సిరీస్ కాస్త తడబడింది. 6వ ఎపిసోడ్ నుంచి కాస్త నెమ్మదిస్తుంది అలాగని పూర్తిగా ట్రాక్ తప్పదు. అప్పటివరకు ఒక అద్భుతమైన సస్పెన్స్ డ్రామా చూస్తున్నామన్న భావన కాస్తా, వీక్ రైటింగ్ వల్ల కాస్త తగ్గుతుంది. ఒక ముఖ్యమైన పాత్రను మరీ అతిగా, వినయంతో చూపించడంతో జరగబోయేది ఏంటో ప్రేక్షకుడికి ముందే అర్థమైపోతుంది. దాని వెనుక ఉన్న ఫ్లాష్‌బ్యాక్ కూడా అంతగా రుచించదు. అలాగే భార్యకు సంబంధించిన ట్రాక్ కూడా కథకు అనవసరంగా అతికించినట్లు అనిపిస్తుంది. ముగింపులో బలమైన ఎమోషన్స్ ఉండి ఉంటే ఈ సిరీస్ స్థాయి మరోలా ఉండేది. ఊహకు అందే ముగింపు కూడా ఉంటుంది.. అయినా కూడా వీకెండ్‌కు డీసెంట్ క్రైమ్ థ్రిల్లర్ చూడాలనుకునేవాళ్లకు రుద్రవనం పిఎస్ మంచి ఛాయిసే.నటీనటులు:పోలీస్ అధికారి పాత్రలో నరేష్ అగస్త్య చాలా సహజమైన నటన కనబరిచాతెలుగులో ఒరిజినల్ వెబ్ సిరీస్‌ల జోరు ఇప్పుడు బాగా పెరిగింది. అదే కోవలో వచ్చిన మరో క్రైమ్ థ్రిల్లర్ రుద్రవనం.్లూ. నరేష్ అగస్త్య నటించిన ఈ సిరీస్ జీ5లో స్ట్రీమింగ్ అవుతుంది. మరి ఈ సిరీస్ ఎలా ఉంది.. మెప్పించిందా లేదా అనేది పూర్తి రివ్యూలో చూద్దాం.. రుద్రవనం అనే ఒక మారుమూల ఊరిలో ఉన్న పోలీసుల కేంద్రం చుట్టూ ఈ కథ నడుస్తుంది. అక్కడ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసే పోలీస్ అధికారి (నరేష్ అగస్త్య), తన పై అధికారితో (బెనర్జీ) కలిసి విధుల్లో ఉంటాడు.డు. బాధ్యత గల అధికారిగా అతని హావభావాలు అందరినీ మెప్పిస్తాయి. పై అధికారిగా సీనియర్ నటుడు బెనర్జీ, పొలిటికల్ లీడర్‌గా రాజా రవీంద్ర తమ అనుభవంతో పాత్రలకు ప్రాణం పోశారు. చారు వాకన్‌తో పాటు మిగిలిన నటీనటులు అంతా తమకు ఇచ్చిన క్యారెక్టర్ల పరిధి మేరకు చక్కగా నటించి మెప్పించారు.టెక్నికల్ టీం:నిర్మాణ విలువలు ఈ తరహా క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డ్రామాకు సరిపోయేలా ఉన్నాయి. పవన్ సమకూర్చిన నేపథ్య సంగీతం సన్నివేశాలలోని ఇంటెన్స్‌ను, టెన్షన్‌ను అమాంతం పెంచేసాయి. అక్షర్ అలీ కెమెరా పనితనం ప్రతి ఫ్రేమ్‌ను చాలా రిచ్‌గా చూపించింది. మాధవ్ ఎడిటింగ్ షార్ట్ అండ్ స్వీట్‌గా ఉండి బాగా ప్లస్ అయింది. దర్శకుడు శశిధర్ మున్నంగి హీరో, విలన్ ట్రాక్స్‌ను సమాంతరంగా నడిపిన తీరు బాగుంది కానీ, చివరి ఎపిసోడ్స్



అనిరుధ్ రవిచందర్, కావ్య మారన్ పెళ్లి వేడుక

ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్, సన్‌రైజర్స్ హైదరాబాద్ యజమాని కావ్య మారన్ పెళ్లి వార్తలు ప్రస్తుతం ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారాయి. ఈ నేపథ్యంలో వీరి వెడ్డింగ్ రిసెప్షన్‌కు సంబంధించిన వార్తలు మరింత ఆసక్తిని పెంచుతున్నాయి. నవంబర్ 21న చెన్నైలో జరగనున్న ఈ రిసెప్షన్‌కు దేశంలోని పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు హాజరుకానున్నారు. ముఖ్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, సూపర్ స్టార్ రజినీకాంత్, అజిత్ కుమార్ వంటి ప్రముఖుల పేర్లు అతిథుల లిస్ట్‌లో వినిపిస్తున్నాయి. వీరి వివాహ వేడుకల సందర్భంగా నవంబర్ 21న చెన్నైలో గ్రాండ్ రిసెప్షన్ నిర్వహించనున్నట్లు తెలుస్తుంది. ఈ వేడుకకు రాజకీయ, సినీ, క్రీడా రంగాలకు చెందిన ప్రముఖులను ఆహ్వానిస్తున్నట్లు సమాచారం. దీంతో ఈ రిసెప్షన్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. కావ్య మారన్ తండ్రి, సన్ గ్రూప్ చైర్మన్ కళానిధి మారన్, ఆయన భార్య కావేరి మారన్ స్వయంగా పలువురు ప్రముఖ రాజకీయ నాయకులను కలిసి పెళ్లి రిసెప్షన్‌కు ఆహ్వానాలు అందిస్తున్నారు. ఈ క్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కూడా కలిసి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాలకు కూడా ఆహ్వానాలు అందించారు. ఢిల్లీలో సోనియా గాంధీని కళానిధి మారన్, కావేరి మారన్ కలిసి ఆహ్వానించారు.అలాగే సూపర్ స్టార్ రజినీకాంత్ ఈ వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు. అనిరుధ్‌కు రజినీకాంత్ దగ్గరి బంధువు కూడా.. రజినీకాంత్ నటించిన పలు సినిమాలకు అనిరుధ్ సంగీతం అందించారు. ముఖ్యంగా వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన పాటలు అభిమానులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. తమిళ స్టార్ హీరో అజిత్ కుమార్, ఆయన భార్య శాలిని అజిత్ కుమార్‌లను కూడా ఈ రిసెప్షన్‌కు ఆహ్వానించినట్లు తెలుస్తోంది. వీరితో పాటు తమిళ చిత్ర పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు ఈ వేడుకలో సందడి చేయనున్నట్లు సమాచారం. లోకనాయకుడు కమల్ హాసన్, ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ పేర్లు కూడా అతిథుల జాబితాలో వినిపిస్తున్నాయి.వీరితో పాటు నటుడు ధనుష్, శివకార్తికేన్, దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ వంటి ప్రముఖులకు కూడా ఆహ్వానాలు అందినట్లు తెలుస్తుంది. టాలీవుడ్ నుంచి ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, ఆయన భార్య స్నేహా రెడ్డి ఈ వేడుకకు ఆహ్వానించారని తెలుస్తుంది. దక్షిణాది చిత్ర



ఏం సినిమా రా నాయనా.100 కోట్లతో బాక్సాఫీస్ సెన్సేషన్.

భారతీయ చలనచిత్ర పరిశ్రమలో పెద్ద హీరోల సినిమాలు, వందల కోట్ల భారీ బడ్జెట్ చిత్రాలు మాత్రమే రికార్డులు సృష్టిస్తాయనే అపోహను ఎప్పుడూ కొన్ని చిన్న సినిమాలు పటాపంచలు చేస్తుంటాయి. కంటెంట్ బాగుంటే ప్రేక్షకులు చిన్న సినిమా పెద్ద సినిమా అనే తేడా చూడకుండా బ్రహ్మరథం పడతారు అనడానికి కన్నడ చిత్ర పరిశ్రమ నుంచి వచ్చిన ఒక సరికొత్త చిత్రం అద్దం పడుతోంది. ఎటువంటి భారీ అంచనాలు లేకుండా, కేవలం రూ. 2.5 కోట్ల ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఈ స్థాయికి చేరుకోవడం అంత సులభంగా జరగలేదు. సినిమా నిర్మాణం సమయంలో దర్శకుడు, నిర్మాతలు పడిన కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఆర్థిక ఇబ్బందులు తారస్థాయికి చేరినప్పుడు సినిమా పూర్తి చేయడం కోసమే ఏకంగా కుటుంబ సభ్యుల ఆభరణాలను తాకట్టు పెట్టాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇక విడుదలకు ముందు థియేటర్లు దొరక్క, పెద్దగా ప్రమోషన్స్ చేయడానికి కూడా బడ్జెట్ లేక మేకర్స్ తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఈ స్థాయికి చేరుకోవడం అంత సులభంగా జరగలేదు. సినిమా నిర్మాణం సమయంలో దర్శకుడు, నిర్మాతలు పడిన కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఆర్థిక ఇబ్బందులు తారస్థాయికి చేరినప్పుడు సినిమా పూర్తి చేయడం కోసమే ఏకంగా కుటుంబ సభ్యుల ఆభరణాలను తాకట్టు పెట్టాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇక విడుదలకు ముందు థియేటర్లు దొరక్క, పెద్దగా ప్రమోషన్స్ చేయడానికి కూడా బడ్జెట్ లేక మేకర్స్ తీవ్ర ఇబ్బందులు పడ్డారు.తొలి రోజు కేవలం కొన్ని థియేటర్లలోనే విడుదలైన ఈ చిత్రం, ప్రేక్షకులకు రీచ్ కావడం కోసం వినూత్న రీతిలో వివాహ ఆహ్వాన పత్రికల మాదిరిగా కరపత్రాలు పంచుతూ ప్రజలను సినిమా చూడమని కోరాల్సిన దుస్థితి ఏర్పడింది. అయితే సినిమా విడుదలైన మొదటి ఆట నుంచే మౌత్ టాక్ అద్భుతంగా పనిచేసింది. ప్రేక్షకులు సినిమాకు బ్రహ్మరథం పట్టడంతో క్రమక్రమంగా షోల సంఖ్య పెరుగుతూ వచ్చింది. చిన్న సినిమాగా వచ్చి ఊహించని విధంగా కలెక్షన్ల సునామీ సృష్టించిన ఈ చిత్రం, బాక్సాఫీస్ వద్ద ఏకంగా రూ. 100 కోట్లకు పైగా ప్రపంచవ్యాప్త వసూళ్లను సాధించి అందరినీ విస్మయానికి గురిచేసింది.

జయలలిత పాత్రలో త్రిష..



సౌతిండియన్ బ్యూటీ త్రిష కృష్ణన్ వెండితెరపై కనిపించి చాలా రోజులు అవుతోంది. అయితే ఇటీవలి కాలంలో ఆమె సినిమాల గురించికాకుండా ఇతర విషయాలతో తరచూ వార్తల్లో నిలుస్తున్నారు. ముఖ్యంగా సీఎం విజయ్ తో త్రిష ప్రేమలో ఉన్నారని, పెళ్లి కూడా చేసుకుంటారన్న వార్తలు ఆ మధ్యన హాట్ టాపిక్ గా మారాయి. ఈ సంగతి పక్కన పెడితే.. ఇప్పుడు త్రిష పేరు మరోసారి మార్మోగుతోంది. అదేంటంటే. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, దివంగత నటుడు ఎం.జి. రామచంద్రన్ జీవితం ఆధారంగా ఓ సినిమా తెరకెక్కుతోంది. ఈ బయోపిక్‌లో, మాజీ ముఖ్యమంత్రి జయలలిత పాత్రను త్రిష పోషించనున్నారనే వార్తలు బలంగా వినిపిస్తున్నాయి. 'పురచీ తలైవర్ ఎంజీఆర్' అనే పేరుతో తెరకెక్కుతున్న ఈ బయోపిక్‌లో ఎంజీఆర్ సినీ జీవితం, అలాగే రాజకీయ జీవితంలోనూ ఆయన ఎదుర్కొన్న ఆటు పోట్లను చూపించనున్నారు. కాగా ఎంజీఆర్ వ్యక్తిగత, రాజకీయ జీవితంలో జయలలితది కీలక పాత్ర. ఆమె కూడా వెండితెరపైనా ఆపై రాజకీయ రంగంలోనూ సత్తా చాటారు. దేశంలోనే అత్యంత ప్రభావవంతమైన నాయకురాలిగా ఎదిగారు. ఈ క్రమంలో సవాళ్లతో కూడిన ఈ పాత్ర కోసం త్రిషను ఎంపిక చేసేందుకు చిత్ర బృందం చర్చలు జరుపుతోందని అంటున్నారు.ఈ బయోపిక్‌లో ఎంజీఆర్, జయలలిత మాత్రమే కాకుండా, సి.ఎన్. అన్నదురై, ఎం. కరుణానిధి వంటి తమిళనాడు రాజకీయాల్లోని ప్రముఖులు కూడా కనిపించనున్నారు. ఈ చిత్రంలో ఎంజీఆర్ పాత్రను జె.ఎం. బషీర్ పోషిస్తున్నారు. చెన్నైలోని రామపురంలో త్వరలోనే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. త్రిష జయలలిత పాత్రను అంగీకరిస్తే, సినిమాపై అంచనాలు రెట్టింపు అవుతాయనడంలో సందేహం లేదు. అయితే, ఈ నటీనటుల ఎంపికకు సంబంధించి చిత్ర బృందం నుంచి ఇంకా అధికారిక ప్రకటన ఏదీ రాలేదు. చర్చలు తుది దశలో ఉన్నాయి,



వాటితో నాకు ఎలాంటి సంబంధం లేదు.

సెలబ్రిటీల పేరిట సోషల్ మీడియాలో ఫేక్ అకౌంట్లు, నకిలీ ప్రచారాలు నడవడం ప్రస్తుతం సర్వసాధారణమైపోయింది. ముఖ్యంగా స్టార్ హీరోలు లేదా ప్రముఖుల వారసులు సినిమా రంగంలోకి అడుగుపెడుతున్న సమయంలో ఇలాంటి వదంతులు మరింత ఎక్కువగా వస్తుంటాయి. తాజాగా తమిళనాడు ముఖ్యమంత్రి, ప్రముఖ నటుడు విజయ్ కుమారుడు, యువ దర్శకుడు జాసన్ సంజయ్ తన పేరుతో జరుగుతున్న తప్పుడు ప్రచారంపై తీవ్రంగా స్పందించారు. తన పేరుతో ఎలాంటి అధికారిక అభిమాన సంఘాలు లేదా సోషల్ మీడియా పేజీలను ప్రారంభించలేదని ఆయన స్పష్టం చేశారు. తన అధికారిక సోషల్ మీడియా ఖాతాల ద్వారా స్పష్టతనిచ్చిన జాసన్ సంజయ్.. సోషల్ మీడియాలో చలామణి అవుతున్న నకిలీ ఖాతాలను ఎవరూ నమ్మవద్దని కోరారు. తన పేరు లేదా ఫొటోలతో ఉన్న ఫేక్ అకౌంట్ల నుంచి వచ్చే పోస్టులు, కామెంట్లతో తనకెలాంటి సంబంధం లేదని తేల్చిచెప్పారు. అభిమానులు ఎవరూ అలాంటి నకిలీ సమాచారాన్ని నమ్మి మోసపోవద్దని, ఎవరైనా తన పేరుతో కొత్తగా అధికారిక ఫ్యాన్ క్లబ్‌లను ఏర్పాటు చేసినట్లు ప్రచారం చేస్తే వాటిని విశ్వసించవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.కాగా, జాసన్ సంజయ్ కేవలం నటుడి కుమారుడిగా మాత్రమే కాకుండా, తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు



ఈ వారం కూడా వర్షిణీ సేఫ్.. మరి బిగ్‌బాస్ 10 నుంచి ఎలిమినేట్ అయ్యేది ఎవరో తెలుసా?

ఎవరూ ఊహించని ట్విస్టులతో బిగ్ బాస్ తెలుగు సీజన్ 10 రసవత్తరంగా సాగుతోంది. ఇప్పటికే ఈ రియాలిటీ షో దిగ్విజయంగా ఏడు వారాలు పూర్తి చేసుకుంది. ఎనిమిదో వారం కూడా వీకెండ్ కి చేరుకుంది. మరి ఈ వీకెండ్ లో భాగంగా ఎవరు ఎలిమినేట్ అవుతారన్నది ఆసక్తికరంగా మారింది. దీనికి తోడు ఈ వారం కూడా డబుల్ ఎలిమినేషన్ అని ప్రచారం జరుగుతోంది. దీంతో కంటెస్టెంట్లలో దడ మొదలైంది. ఈ వారం నామినేషన్లలో రోహిత్, వంశీ, రామ్ ప్రసాద్, ఝాన్సీ, శివ, రామకృష్ణ, యాంకర్ వర్షిణి,సుధీర్ ఉన్నారు. మొత్తం ఎనిమిది మంది ఎలిమినేషన్ ముప్పును ఎదుర్కొంటుండటంతో ఈ వారం ఎవరు బయటకు వస్తారన్నది ఆసక్తికరంగా మారింది. అయితే వీరిలో యాంకర్ వర్షిణీ ఈ వారం కూడా సేఫ్ జోన్ లోకి వెళ్లిపోయిందని సమాచారం. నిజానికి బిగ్ బాస్ హౌస్ లో ఆమె నుంచి పెద్దగా పెర్ఫామెన్స్ లేదు. టాస్కులు కూడా పెద్దగా ఆడడం లేదు. అయినా ప్రతి వారం ఈ యాంకరమ్మను బిగ్ బాస్ సేఫ్ చేస్తున్నాడు అంటూ రూమర్లు వినిపిస్తున్నాయి. ఇక ఈ వారం కూడా నామినేషన్స్ లో ఉన్నప్పటికీ వర్షిణీ ఎలిమినేషన్ నుంచి దాదాపు బయటపడిందనే తెలుస్తోంది.వివరాల్లోకి వెళితే.. 'ది అల్టిమేట్ గోట్' థీమ్ లో భాగంగా హౌస్‌లో బీబీ హోటల్ టాస్క్ జరిగింది. ఈ టాస్క్‌లో భాగంగా కంటెస్టెంట్లను రెడ్, ఎల్లో, గ్రీన్ జోన్లుగా

Printed, published &owned. By ravula rajesham printed at. JORDAR publication H.NO.2-5_146 . jammikunta.dist. karimnagar Telangana state 505122..editor.ravula rajesham, email. editor jordar@gmail.com. cellphone 7780185674 PRGi numberTG TEL/25/A5224